
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.4
****

ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	37,867	37,867
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.8661)	36,275	58,214

చికెన్ ధరలు | లైవ్ : రూ.150 | డ్రెస్ : రూ.240 | స్కిన్‌లెస్ : రూ.260





మద్యం దుకాణాలకు లక్కీడ్రా నేడు

- జిల్లాలో 154 దుకాణాలకు నిర్వాహకుల ఎంపిక
- కలెక్టర్ సమక్షంలో డ్రా
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

నల్లగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఎక్సైజ్ సంవత్సరం 2025-27కు సంబంధించి మద్యం దుకాణాల నిర్వాహకుల ఎంపిక సోమవారం జరగనుంది. అందుకోసం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీగార్డెన్స్‌లో ఎక్సైజ్ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 154 దుకాణాలకు మొత్తం 4,906 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఉదయం 11గంటల నుంచి దుకాణాల వారీగా లక్కీడ్రా కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో నిర్వహించనున్నారు. ఒక్కో దుకాణం వారీగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఆధారంగా కూపన్లను ఏర్పాటు చేసి డ్రా తీస్తారు. డ్రాలో అదృష్టం ఎవరిని వరిస్తే వారికే రానున్న రెండేళ్లపాటు ఆ దుకాణం నిర్వహించుకునేందుకు అనుమతి మంజూరవుతుంది. ఉత్కంఠభరితంగా డ్రా జరగనుండడంతో దరఖాస్తుదారులు లేదా వారి అధీకృత వ్యక్తులను మాత్రమే డ్రా తీసే హాల్‌లోకి అనుమతిస్తారు. లక్కీడ్రాలో ఎంపికైన లైసెన్స్‌దారులకు ఈ ఏడాది డిసెంబరు 1, నుంచి 2027 నవంబరు 30 వరకు ఆయా దుకాణాల్లో మద్యం వ్యాపారం నిర్వహించుకునేందుకు అనుమతిస్తారు.

అధికంగా వ్యాపారం జరిగే దుకాణాలపైనే అందరి దృష్టి

జిల్లాలో మద్యం దుకాణాలకు గతం మాదిరిగా ఈసారి దరఖాస్తులు తగ్గినా పోటీమాత్రం బలంగానే ఉంది. 154 దుకాణాలకు ఎస్టీలకు 4,ఎస్సీలకు 14, గౌడసామాజికవర్గానికి 34 దుకాణాలు కేటాయించగా, మిగిలిన దుకాణాలను ఓపెన్ కేటగిరీలో ఉంచారు. జిల్లాలో మద్యం వ్యాపారం ఎక్కువగా జరుగుతుందని భావించే దుకాణాలకు టెండర్లు సైతం అదేరీతిలో భారీగా వచ్చాయి. నల్లగొండ డివిజన్‌లోని దర్వేశిపురం దుకాణానికి 154 దరఖాస్తులు రాగా, వెలిమినేడు దుకాణానికి 82, కంచనపల్లికి 74దరఖాస్తులు వచ్చాయి. చండూరు, నందికొండల్లోని దుకాణాలకు అత్యల్పంగా 18 చొప్పున దరఖాస్తులు రాగా, తిరుమలగిరి, నాంపల్లి, మర్రిగూడ, నందికొండ, నకిరేకల్ దుకాణాలకు 19 చొప్పున, నకిరేకల్, చండూరు, మునుగోడులోని మూడు దుకాణాలు, హాలియా దుకాణాలకు 20 చొప్పున, పీఏపల్లి, నకిరేకల్, త్రిపురారం, మర్రిగూడ, నాంపల్లిలోని దుకాణాలకు 21 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

- మిగతా 8వ పేజీలో...



ఉమ్మడి జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యాలయంలో పలు సాంకేతిక సమస్యలతో ఆస్తుల క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడు నిమిషాల్లో పూర్తి కావల్సిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గంటన్నర నుంచి రెండు గంటల వరకూ పూర్తికాకపోవడంతో సంబంధితశాఖ అధికారులు, సిబ్బంది, ఆస్తుల క్రయ, విక్రయదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఎన్ని రోజులు ఈ ఇబ్బందులు!

- ఏడు నిమిషాల్లో పూర్తి కావల్సిన డాక్యుమెంట్‌కు రెండు గంటలు
- ఇంటర్‌నెట్ స్లోకావడంతో ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి

రిజిస్ట్రేషన్లశాఖలో కొత్త కొత్త విధానాలు తీసుకువస్తుండటంతో ఉన్న సమస్యల పరిష్కారానికి బదులు కొత్తఇబ్బందులు ఎదురవుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ మూడు నాలుగుసార్లు థంబ్ వేయడం, ఆస్తుల క్రయ, విక్రయదారులు సైతం అదే స్థాయిలో వేలిముద్ర లు వేయడంతో పాటు ఫొటోలు మూడు, నా లుగుసార్లు దిగాల్సి వస్తోంది. కేవైసీ సైతం చేయాల్సి ఉంటోంది. గతంలో స్లాట్ బుకింగ్ లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని భావించిన ప్రభుత్వం స్లాట్ బుకింగ్ తీసు వచ్చినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రోజుకు 46వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యే లా స్లాట్ బుకింగ్ చేసుకునే వీలుంది.వారికి నిర్ధారించిన సమయంలోనే వచ్చి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అయితే సమయానికి వచ్చినా, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని క్రయ, విక్రయదారులు వాపోతున్నారు.

ఇంటర్‌నెట్ వేగం పెంచకపోవడంతో...

స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖలో వేగవంతంగా పనులు పూర్తయ్యేందుకు అత్యధిక వేగం ఉన్న బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్‌నెట్ అవసరం. అయితే ఇంటర్‌నెట్ స్లోగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడూ తర చూ సర్వర్ డౌన్ అవుతోంది. ఈనెల 22, 22 తేదీల్లో రిజిస్ట్రేషన్ శాఖలో మొత్తంగా సేవలు నిలిచిపోయాయి. ఈరెండు రోజులు రిజిస్ట్రేషన్‌శాఖవెబ్‌సైట్ మొరాయించడంతో చలానా, ఈసీలు,సీసీలు, మార్కెట్ విలువ, చివరికి స్లాట్ బుకింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. సర్వర్ బీజీతో గంటల తరబడి పనులు నిలిచాయి. రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించి వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో పాటు సర్వర్ మొరాయించడంతో సకాలంలో పనులు జరగడం లేదు. నెల రోజులుగా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నా రాష్ట్ర స్థాయి అధికారులు పరిస్థితులను సరిదిద్దకపోవడంతో సేవలు ఆలస్యమవుతున్నాయి.

20ఏళ్ల క్రితం రూపొందించిన సాఫ్ట్‌వేర్..

స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖలో 20 ఏళ్ల క్రితం రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఆధారంగానే వెబ్‌సైట్ పని చేస్తోంది. సాంకేతికంగా అనేక మార్పులు వచ్చినా ఈ వెబ్‌సైట్‌లో మాత్రం మార్పులు చేయలేదు. దీంతో సాంకేతిక సమస్యలు ఎదురై వెబ్‌సైట్ మొరాయిస్తుండటం, ఒక్కోసారి సర్వర్ డౌన్ అవుతోంది. దాన్ని చక్కదిద్దే సరికి గంటల సమయం పడుతోంది. చలానా తీసేందుకు గంటల తరబడి ఎదురుచూడలేక కొంత మంది ఆస్తుల క్రయ, విక్రయదారులు మరుసటి రోజు రిజిస్ట్రేషన్‌కు వస్తున్నారు. ప్రతీ రోజు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 800 నుంచి 1,000 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. ప్రస్తుతం సాంకేతిక సమస్యలతో అందులో 50శాతం డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కూడా పూర్తవడం లేదు. ఈసీలు డౌన్‌లోడ్ కాక చాలా మంది ఎదురుచూస్తున్నారు.....

- మిగతా 8వ పేజీలో...

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావద్దు: కలెక్టర్



నల్లగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు రోజుల్లో మొంథా తుపాను ప్రభావం జిల్లా లో తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రానున్న రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలోని ఆరు జిల్లాలో మొంథా తుపాను కారణంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. జిల్లాలో కూడా ఆ ప్రభావం ఎక్కువగానే ఉండనున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేలాడే విద్యుత్ వైర్లు, వంగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం ఉన్నందున వా టి సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల కు తడిసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకురావద్దన్నారు. రానున్న మూడు రోజులు తహసీల్దార్లు వారు పనిచేసే స్థానాల్లోనే ఉండాలని, ఇప్పటికే సెలవు దరఖాస్తు చేసి ఉంటే వాటిని రద్దు చేస్తున్నట్టు తెలిపారాడు. నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ఎగుమతి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు వారి పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలను సిద్ధం చేయాలన్నారు. 27న మధ్యాహ్నం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి ధాన్యాన్ని ఎగుమతి చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. మొంథా తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ఉండేలా గ్రామ పాలనాధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏజెన్సీలు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీసీవో పత్యానాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయదేవి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో నల్లగొండ పాత్ర కీలకం

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్



శాలిగౌరారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్

శాలిగౌరారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ నేత చామల జైపాల్‌రెడ్డి నివాసంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకున్నందున రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సీఎంగా రేవంత్‌రెడ్డి ఎన్నికయ్యారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారెంటీలను అంచెలంచెలుగా సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌కు తెలియజేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలను అర్థం చేసుకోకుంటే తిరిగి అధికారంలోకి రావడం కష్టంగా ఉంటుందనే అభిప్రాయాన్ని పార్టీ పెద్దలకు తెలియజేస్తానన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి గ్యాప్ ఏర్పడినందునే పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రాలేదన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ నాయకులపై అహంకారపూరితంగా, బూతులు మాట్లాడటం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, బండపెల్లి కొమరయ్యగౌడ్, చమల జైపాల్‌రెడ్డి, చింత ధనుంజయ, నారగోని అంజయ్య, వడ్లకొండ పరమేష్ గౌడ్, బొల్లికొండ గణేష్, పుల్లూరు దేవేందర్, నిమ్మల కృష్ణ, కడారి అంజయ్య, జమ్మ అశోక్, పోల్‌దాస్ నరేష్, వేముల భరత్, అన్నెబోయిన అనిల్, ఇబ్రహీం, గంధసిరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధుయాష్కిగౌడ్ తుడిమిడి గ్రామంలో పవన్‌సాయి ఆస్పత్రి అధినేత ఆలేటి శ్రీనివాస్ మాతృమూర్తి లింగమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మనలో చైతన్యం లేకే అగ్రవర్ణాల ఆధిపత్యం

ఆర్ఎల్డీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్

నల్లగొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో చైతన్యం లేకపోవడం వల్లే అగ్రవర్ణాల ఆధిపత్యం నడుస్తోందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ (ఆర్ఎల్డీ) రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సామాజిక చైతన్య రథయాత్ర ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్ర సాధన కోసం 98శాతం బడుగు వర్గాలే ప్రాణాలు కోల్పోయారని, అయినా బహుజన తెలంగాణ రాలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు తెలంగాణలో ఒరిగిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతలు హరీ్‌షరావు, సంతోష్‌రావు అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు సంపాదించారని కల్వకుంట్ల కవిత ఆరోపించారని గుర్తుచేశారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చి ఆయనకు వెన్నుపోటు పొడిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల చెందిన అభ్యర్థులు పోటీచేయాలన్నారు. ఇతర పార్టీల నుంచి బీ-ఫాం లభించని వారు తనను సంప్రదిస్తే ఆర్ఎల్డీ పార్టీ నుంచి బీ-ఫాం ఇస్తానని హామీ ఇచ్చారు. బలహీనవర్గాలు ఏకమైతేనే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్ పరిశ్రమల్లో 95శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, రాజీవ్ యువ వికాసం కింద రూ.5లక్షలు యువకులకు రుణం ఇవ్వాలని, నిరుద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఆర్ఎల్డీ పార్టీ నాయకులు ముద్దం మల్లేష్, నందిపాటి జానయ్య, నర్సింగ్‌రావు, సుధాకర్, బీరప్ప, కోరే సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామనీ.. మీకేంకాదనీ !

- విద్యార్థుల సేవలో స్వాన్
- శ్రీకారం చుట్టిన విశ్రాంత గురువు
- ప్రస్తుతం 740 మంది విద్యార్థుల సభ్యత్వం
- స్ఫూర్తిదాయకంగా కార్యకలాపాలు

7లో..

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్

నల్లగొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 14లక్షల మంది కళాశాలల విద్యార్థులకు రూ.5వేల కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రెండేళ్లుగా ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. పెరిగిన ధరల ప్రకారం స్కాలర్‌షిప్ పెంచాలన్నారు. ప్రభుత్వం బీసీలకు బడ్జెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రెండేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్సు పూర్తయినా కొన్ని యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో పేద విద్యార్థుల చదువు దెబ్బతింటోందన్నారు.

పీసీ కోర్సు చేసిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగాలు పొందిన, విదేశాల్లో ఉద్యోగాలు వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు చదువుకుంటే సంపన్న వర్గాల దోపిడీ పాలన అంతమవుతుందని భయపడుతున్నారని, పేదల్లో చైతన్యం పెరిగి రాజ్యాధికారం దిశగా ఉద్యమాలు వస్తాయని అగ్రవర్ణ పాలకవర్గాలు భయపడుతున్నాయని విమర్శించారు. పెరిగిన ధరల ప్రకారం విద్యార్థుల మెస్ చార్జీలు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఏడాదికి రూ.5,500 నుంచి రూ.20వేలకు, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు రూ.6,500 నుంచి రూ.20వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారింగ్ నరేష్ గౌడ, కన్నబోయిన రంజిత్‌యాదవ్, జక్కుల పరమేష్, ఆవుల ప్రశాంత్, సతీష్, పృథ్వీరాజ్, అంద రాకేష్, ఎర్రబోయిన గణేష్, నిఖిల, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం



నకిరేకల్‌లో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంత ఏర్పడుతుందని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆడిటోరియంలో ఆనందోబ్రహ్మ యోగా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ వ్యక్తి నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. అప్పుడే మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆనందోబ్రహ్మ యోగామండలి బాధ్యులు మిర్యాల చల్మరాజు, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాళ పాపిరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఆరాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు నిధుల వరద

- ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు రూ.285కోట్లు
- నిధుల విడుదలకు ఆమోదముద్ర వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కో మునిసిపాలిటీకి రూ.15కోట్లు
- వచ్చే మార్చి నాటికి పనుల పూర్తి లక్ష్యం

6లో..

వ్యాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ



మిర్యాలగూడలో మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు అన్యాయం చేసేలా రూపొందించిన వ్యాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన పెన్షనర్ల సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. 2026 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం వ్యాలిడేషన్ చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దీంతో పాత పెన్షన్‌దారులకు బెనిఫిట్స్ ఇవ్వకుండా, కొత్తగా రిటైర్మెంట్ అయ్యే వారికి మాత్రమే బెనిఫిట్స్ వర్తించేలా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావాలని చూస్తోందన్నారు.

ఈ చట్టం అమలులోకి వస్తే పాత పెన్షన్‌దారులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టాన్ని రద్దుచేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ యాక్ట్-2025ను రద్దుచేసి ఈపీఎస్ పెన్షన్‌దారులకు కనీస వేతనంగా రూ.9వేలు చెల్లించి హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యుటీ రూ.20లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ని 12ఏళ్లకు కుదించి, రూ.398 వేతనంతో పనిచేసిన టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్, పెన్షన్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించడంతోపాటు నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ పోరాటాలకు సంఘటితంగా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, వాడపల్లి రమేష్, పందిరి శ్యాంసుందర్, పులి కృష్ణమూర్తి, రామావతారం, సత్యనారాయణ, మల్లుగౌతమ్‌రెడ్డి, రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, మరణారెడ్డి, సత్యనారాయణరావు, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు నిధుల వరద

● ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు రూ. 285 కోట్లు



భువనగిరి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణాలకు నిధుల వరదరానుంది. పట్టణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ఒక్కో మునిసిపాలిటీకి రూ.15 కోట్ల విడుదలకు ఆమోదముద్ర వేసింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు రూ.285కోట్లు రానున్నాయి. ఆ నిధులతో ప్రతిపాదించిన పనులన్నీ వచ్చే మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. దీంతో ప్రజలను వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం లభించనుంది. అధికారులు త్వరలో విధివిధానాలు పూర్తిచేసి టెండర్ ప్రక్రియకు వెళ్లనున్నారు. ఈ నిధులతో చేపట్టనున్న పనులను ఉన్నతస్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు.

ప్రాధాన్యం ఇలా..

త్వరలో రానున్న నిధులతో చేపట్టాల్సిన పనుల ప్రాధాన్యంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అంతర్గత రహదారుల మరమ్మతులు, మురికి కాలువలు, పట్టణ చెరువులు, కుంటలలో కాలుష్య నివారణ పనులు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంతాల్లో మౌలిక వసతులు, పట్టణాల సుందరీకరణ పనులు, ఓపెన్ జిమ్‌లు, విలీన గ్రామాల అభివృద్ధికి నిధులను వినియోగించనున్నారు. ప్రతిపాదిత పనులన్నీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాకు రూ. 285 కోట్లు

ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు రూ.285 కోట్లు రానున్నాయి. నల్లగొండ జిల్లాలోని ఎనిమిది మునిసిపాలిటీలకు రూ.120కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలకు రూ. 90 కోట్లు, సూర్యాపేట జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలకు రూ. 75 కోట్లు త్వరలో విడుదల కానున్నాయి.

ఒక ట్రాక్టర్‌కు అనుమతి..

● .. మూడు ట్రాక్టర్లలో తరలింపు ● అక్రమార్కులకు అండగా అధికారులు, నాయకులు

రాజాపేట, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక, మట్టి దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లుగా సాగుతోంది. ఇసుక తరలింపునకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. ఏకంగా యంత్రాలతోనే ఇసుకను ట్రాక్టర్లలో నింపి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారుల అండతోనే ఇసుక వ్యాపారం జోరుగా సాగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని నెమిల, దూది వెంకటాపూర్, బేగంపేట, రఘునాథపూర్, రేణికుంట, బేగంపేట, చల్లూరు, కుర్రారం, పారుపల్లి గ్రామాల్లో వాగులున్నాయి. దూది వెంకటాపూర్, నెమిల, రఘునాథపూర్, రేణికుంట, బేగంపేట వాగుల నుంచి ఇసుకను జోరుగా తరలిస్తున్నారు. కొంత కాలంగా ఇసుకను తరలిస్తుండటంతో వాగులు సహజత్వాన్ని కోల్పోయి కోతకు గురై రెండు, మూడు మీటర్ల లోతుకు కూరుకుపోయాయి. వాగు పక్కన ఉన్న సేద్యపు భూములు సైతం కోతకు గురవుతున్నాయి. మండలంలోని నెమిల వాగులో భూగర్భజలాలు కాపాడేందుకు 1995లో రూ.8లక్షలతో పేపర్ చెక్‌డ్యాంను నిర్మించగా, అక్రమ ఇసుక తరలింపుతో పూర్తిగా ధ్వంసమైంది.

దందా కొనసాగుతుందిలా..

రాజాపేట మండలంలోని రేణికుంట రఘునాథపూర్, దూది వెంకటాపూర్, నెమిల గ్రామాల వాగులనుంచి నిత్యం వందల ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలిపోతుంది. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనుమతులు తీసుకుని మండలంలోని గ్రామాలకు కాకుండా ఇతర పట్టణాలకు తరలిస్తున్నారు. అధికారుల నుంచి అనుమతులు నామమాత్రంగా తీసుకుని దందాను సాగిస్తున్నారు. అధికారుల నుంచి రోజుకు అనుమతి తీసుకొని ఒక్కో ట్రాక్టర్ నాలుగు ట్రిప్పులు మాత్రమే తరలించాలని నిబంధనలు ఉన్నా, రోజుకు 8 నుంచి 10 ట్రిప్పుల వరకు రవాణా చేస్తున్నారు. కూలీలతో నింపాలని ఉన్నా, ఏకంగా యంత్రాలనే వినియోగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నారు. ఇసుకను బొమ్మలరామారం, భువనగిరి, యాదగిరిగుట్ట, జగదేవపూర్, చేర్యాల, గజ్వేల్, ఆలేరు, తుర్కపల్లి మండలాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుకను ఇతర మండలాలకు తరలించి ట్రాక్టరుకు రూ.6వేల నుంచి రూ.8 వేల వరకు తీసుకుంటున్నారు. అధికారుల నుంచి ఒక ట్రాక్టర్‌కు అనుమతి తీసుకుని ఆ అనుమతిపైనే మూడు ట్రాక్టర్లను నడుపుతున్నారు. నెంబరులేని ట్రాక్టర్లను ఇసుక రవాణాకు వినియోగిస్తున్నారు. అధికారులు నెంబరు లేని వాహనాలకు అనుమతులు ఇవ్వడంతో ఒక ట్రాక్టర్‌కు అనుమతి తీసుకుని మూడు ట్రాక్టర్లను నడుపుతున్నారు. దీంతో అధికారుల నిఘా కరువవడంతో అడ్డు అదుపు లేకుండా పోయింది. అధికారులు నామమాత్రంగా అప్పుడప్పుడు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నామ్‌కే వాస్తేగా తనిఖీలు చేస్తుండగా నెంబరు లేని వాహనాల్లో ఇసుకను కార్యాలయాల ముందు నుంచి తరలిస్తున్నా అధికారులకు మాత్రం కనిపించడంలేదు. మండలంలో రోజుకు 100 నుంచి 120 ట్రాక్టర్ల వరకు ఇసుకను తరలిస్తున్నాయి. రోజుకు 300 నుంచి 500 ట్రాక్టర్ల వరకు ఇసుక తరలిపోతుంది.



ఇసుక తరలింపుతో ఏర్పడిన గుంతలు, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

ముందు ఎస్కార్ట్.. తర్వాత ఇసుక ట్రాక్టర్లు

మండలంలోని వాగుల నుంచి రాత్రిపూట అక్రమంగా ఇసుకను ఇతర మండలాలు, పట్టణాలకు ఎస్కార్టు సాయంతో తరలిస్తున్నారు. వాగులో యంత్రాల సాయంతో ఇసుకను నింపుతున్న సమయంలో కొందరు ఇసుక వ్యాపారులు పోలీసుస్టేషన్ సమీపంలో, తహసీల్దార్ కార్యాలయం వద్ద కాపలా ఉంటూ పోలీసుల, అధికారుల కదలికలను గమనిస్తుంటారు. అధికారులు, పోలీసులలోనే కొందరు కొరియర్లుగా మారి సమాచారాన్ని చేరవేస్తూ సహకరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఇసుక ట్రాక్టర్లు వెళ్లే ముందు ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్లి రూట్ క్లియర్‌గా ఉందని ఫోన్‌లో సమాచారం ఇస్తారు. వెంటనే రెండు నుంచి 5 ట్రాక్టర్ల వరకు ఒకేసారి బయలుదేరుతాయి. ఎవరైనా ఉన్నారంటే ట్రాక్టర్లను పక్కదారిలో ఉంచుతారు. లైన్ క్లియర్ కాగానే వెళ్తారు.

అలా పట్టుకుని.. ఇలా వదిలేస్తారు

మండలంలో ఇసుక అక్రమ రవాణాపై నియంత్రణ కరువైంది. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఇసుక అక్రమ రవాణాపై ఎవరైనా సమాచారం ఇస్తే అధికారులు ట్రాక్టర్లను పట్టుకుని నానా హంగామా చేస్తుంటారు. అలా ట్రాక్టర్లను పట్టుకోగానే అధికార పార్టీ నాయకులనుంచి మరుక్షణంలో ఫోన్లు రాగానే ఇలా వదిలేస్తున్నారు. రాజకీయ నాయకుల పైరవీలు, నాయకుల ఫోన్లతో అధికారులకు తలనొప్పిగానే మారింది. ఇక్కడ విధులు నిర్వహించాలంటే కత్తిమీద సాములా మారిందని ఓ అధికారి ఆవేదన వ్యక్తంచేశారు. కొంత మంది అధికారులు మట్టి, ఇసుక రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించినా మైనింగ్ అధికారుల నుంచి స్పందన అంతంతే. మైనింగ్ అధికారులు నామమాత్రం జరిమానాలు వేసి వదిలేస్తున్నారు. ఇటీవల మండలంలోని చల్లూరు గ్రామంలో చెరువు 20 నుంచి 30 టిప్పర్లలో 20 రోజులుగా వందల క్యూబిక్ మీటర్ల మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకుని మైనింగ్ అధికారులకు అప్పగించగా, వారు నామమాత్రం జరిమానావేసి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలున్నాయి.

భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం

మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం లేకపోలేదు. గతంలో మండలాన్ని ప్రభుత్వం డార్క్ ఏరియాగా ప్రకటించింది. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని నిన్న మొన్నటివరకు ఇసుక రవాణాకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. అయినా మండలంలో భూగర్భజలాలు అడుగంటిపోయి బోరులు, బావులు ఎండిపోయి నీరందక పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు 10 మీటర్ల లోతుకు పడిపోయాయి. నీటి నిల్వలు తగ్గిపోవడంతో 300 నుంచి 600 అడుగుల వరకు బోర్లు వేస్తే తప్ప నీరు రావడంలేదు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకపోతే భూగర్భజలాలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఇసుక తరలిస్తే నీరు అడుగంటిపోతుందని, ఇసుకపై పూర్తి నియంత్రణ విధించిన అధికారులు ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు ఇవ్వడంతో భూగర్భజలాలు అడుగంటవా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక తరలింపును అడ్డుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వాల్టా చట్టాన్ని కాపాడాలి

మండలంలో వాల్టా చట్టాన్ని కాపాడాలి. ఇసుక, మట్టి, కలప విచ్చలవిడిగా తరలిపోతుంది. మండలంలో వాగులనుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉంది. ఇప్పటికే నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. వాల్టాచట్టాన్ని కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వమే ఇసుకను గోదావరి నుంచి తరలించి ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేయాలి.

ఎర్రగోకుల జశ్వంత్, జలసాధన సమితి కన్వీనర్, రాజాపేట

కేసులు నమోదు చేస్తున్నాం

మండలంలో ఇసుక అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తున్నాం. నిబంధనల మేరకే అనుమతులిస్తున్నాం.

ఐ.అనిత, తహసీల్దార్, రాజాపేట

షార్ట్ సర్క్యూట్‌తో సర్టిఫికెట్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన సర్టిఫికెట్లు

చిలుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో సర్టిఫికెట్లు దగ్ధమైన ఘటన సూర్యాపేట జిల్లా మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆవుల సతీష్ ఆయన భార్య ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన సతీష్ శనివారంరాత్రి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో జరిగిన హోమగుండం వద్దకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయి. వెంటనే విద్యుత్‌ను నిలిపివేసి చూడగా బీరువాలో ఉన్న విద్యార్హత సర్టిఫికెట్లు, సర్వీస్ పుస్తకాలు, దుస్తులతోపాటు మరికొన్ని వస్తువులు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు.

కోత మిషన్ మీద పడి కూలీ మృతి



తిరుపతిరావు మృతదేహం

గరిడేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రాళ్ల కోత మిషన్ మీద పడి కూలీ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కల్మలచెర్వు గ్రామానికి చెందిన చల్ల తిరుపతిరావు (38) రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని బండరాతి గుట్టపై రోజు కోత మిషన్‌తో రాళ్ల కట్‌చేసి, ఆ రాళ్లను విక్రయించి జీవనం సాగిస్తున్న క్రమంలో అయప్ప మాలధారణలో ఉన్న తిరుపతిరావు ఆదివారం కోత మిషన్‌తో రాళ్లను కట్ చేస్తుండగా ప్రమాదవాశాత్తు మిషన్ తిరుపతిరావు కాలుపై పడి కాలు తెగి రక్తస్రావం జరిగింది. విషయం తెలుసుకొని గ్రామస్తులు వెంటనే 108 వాహనంలో క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలిస్తుండగా తీవ్ర రక్తస్రావం కావడంతో మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. తిరుపతిరావు తల్లి చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

సామాజిక స్పృహ మరిచారు



సూర్యాపేట జిల్లా కోదాడలో జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక డివైడర్‌ను ఏర్పాటు చేశారు. అయినా కొందరు సామాజిక స్పృహ మరిచి, వాటిని తొలగించి రోడ్డును దాటుతూ కన్పించారు. (ఆంధ్రజ్యోతి-కోదాడటౌన్)

సామాజిక స్పృహ గుర్తు చేశారు



మఠంపల్లి నుంచి రఘునాథపాలెం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా దట్టంగా ఉన్న కంపచెట్లతో రైతులు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న రఘునాథపాలెం గ్రామానికి చెందిన కేటీఆర్ యూత్ సభ్యులు స్పందించి, సొంత ఖర్చులతో కంపచెట్లను తొలగించి సామాజిక స్పృహను గుర్తు చేశారు. (ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

కురిసిన వర్షం.. రైతుకు నష్టం



తుంగతుర్తిలో నేలవాలిన వరిపైరు

తుంగతుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రైతులు విలవిలలాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు పడి పంట నేలకు వంగి పోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. మరోపక్క ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ధర్మపరిరక్షణకు కృషి చేయాలి

● త్రిదండి చిన్నజీయర్ స్వామి



శంకుస్థాపన చేస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి

చింతపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సనాతన ధర్మపరిరక్షణకు కృషి చేయాలని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని మోద్గులమల్లేపల్లిలో సీతారామచంద్ర ఆలయ శంకుస్థాపన సందర్భంగా ఆదివారం రాత్రి భూమి పూజ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయాల స్థాపనతో గ్రామాల్లో ఆధ్యాత్మికత పరిడవిల్లుతుందన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉన్నప్పుడే ముక్తిమార్గం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, అధికార ప్రతినిధి సమ్మిడి ప్రకాష్‌రెడ్డి, సమ్మిడి విజయరాంరెడ్డి పాల్గొన్నారు.

మద్యపాన నిషేధమే ధ్యేయంగా..

● ఆ రెండు గ్రామాల్లో తాగినా, తెచ్చినా జరిమానా.. ● సంపూర్ణ మద్యపాన నిషేధం అమలులో ఇస్తాళాపురం, గట్టికల్ ● మరిన్ని గ్రామాల్లో ఆ దిశగా అడుగులు..

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పచ్చని పల్లెల్లో మద్యం మహమ్మారి చిచ్చులు పెడుతూ ప్రజల ధన, ప్రాణాలకు ముప్పు తెస్తుంది. ప్రజలకు మద్యాన్ని ఎరగా చూపి ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయి. మద్యం సేవించడంవల్ల ప్రజల అనారోగ్యంతోపాటు పలు గ్రామాల్లో వివాదాలు, ఘర్షణలు తలెత్తుతుండడం సహజం. అయితే ఇప్పుడిప్పుడే పల్లెల్లో ప్రజలు మద్యం మహమ్మారిని పారదోలే ప్రయత్నాలు సాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలో ప్రస్తుతం రెండు గ్రామాల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు కాగా, మరో రెండు గ్రామాల్లో పాక్షికంగా మద్యపానం నిషేధం అమలు దశలో ఉంది. పదేళ్లుగా ఇస్తాలపురంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన తీర్మానం పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. అదే బాటలో గట్టికల్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలవుతుంది. పాతర్లపహాడ్, ఏనుబాముల గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు కొద్ది రోజులు మూసినప్పటికీ రహస్యంగా కొందరు విక్రయాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇదేబాటలో బోరింగ్ తండా, ముక్కుడు దేవులపల్లి, రామన్నగూడెం, ఆత్మకూర్(ఎస్), తుమ్మల పెన్‌పహాడ్ గ్రామాల్లోనూ మద్యపాన నిషేధం ఉద్యమాలు కొనసాగుతున్నాయి.



గట్టికల్లులో మద్యపాన నిషేదంపై ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

గాంధీ జయంతి సందర్భంగా..

ఇస్తాళాపురంలో 2015 అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా అప్పటి సర్పంచ్ దాయునూరి అరుణ శంకర్ సమక్షంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో మద్యపాన నిషేధం అమలుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం విక్రయించినా, కొనుగోలు చేసినా, ఎవరైనా తెచ్చుకొని తాగినా వారికి రూ.15వేలు జరిమానా, సమాచారం ఇచ్చిన వారికి రూ.15వేలు బహుమతి ప్రకటించి తీర్మానం చేసుకున్నారు. అప్పటినుంచి పదేళ్లుగా నిషేధం అమలు విజయవంతంగా కొనసాగుతోంది.

గట్టికల్ గ్రామంలో..

గట్టికల్ గ్రామంలో గతేడాది అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా గ్రామానికి చెందిన జర్నలిస్టు భూపతి రాములు ఆధ్వర్యంలో అఖిలపక్షాల సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో మద్యపాన నిషేదం అమలుకు ముందుకు రావాలని తీర్మానం చేశారు. దసరా పండగవరకు తెచ్చిన మద్యాన్ని విక్రయించుకోవాలని బెల్ట్‌షాప్‌ల వారికి సూచనలుచేసి, సంపూర్ణ మద్యపాన నిషేదం పాటించేందుకు ఏకగ్రీవ తీర్మానంచేశారు. గ్రామంలో మద్యం విక్రయించడం, కొనుగోలు చేయడం, బయట నుంచి తీసుకొని వచ్చి గ్రామంలో తాగినా వారికి రూ.25వేల జరిమానా, సమాచారం అందించిన వ్యక్తులకు రూ.5వేలు బహుమతిగా ప్రకటించి తీర్మానించారు. అనంతరం గ్రామంలో సుమారు 400మందితో భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. గట్టికల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని పాతర్లపహాడ్, ఏనుబాముల, బోరింగ్‌తండాల్లో మద్యపానం నిషేదం అమలుకు ఉద్యమాలు చేపట్టారు.

● గట్టికల్ గ్రామంలో సుమారు 2,300 జనాభా ఉండగా, వారిలో 1,600 మంది ఓటర్లు ఉన్నారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవిస్తున్నారు. 40శాతం యువత ఉన్నారు. ఎక్కువశాతం పోలీస్, రక్షణ, నేవీతోపాటు ప్రైవేటు బ్యాంకులు, కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారు. మద్యపానం నిషేదం ఖచ్చితంగా కొనసాగుతుంది. ఎలాంటి జరిమానాలు లేవు.

● ఇస్తాళాపురం గ్రామంలో 1,800 మంది జనాభా ఉండగా, 1,250 మంది ఓటర్లు ఉన్నారు. మద్యపాన నిషేధం అమలు తర్వాత యువత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించారు. మొత్తం మూడుసార్లు జరిమానాలు విధించగా, సుమారు రూ.30వేలు రాగా మద్యపాన నిషేధం అమలు పోస్టర్లతో ప్రచారంతోపాటు అభివృద్ధి పనులకు ఆ డబ్బులను వినియోగించారు.


మద్యపానం నిషేధంతోనే సాధ్యం



గాంధీ జయంతి సందర్భంగా పదేళ్ల క్రితం చేసిన సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు కారణంగా గ్రామంలో వివాదాలు, ఘర్షణలు, అనారోగ్య మరణాలు తగ్గాయి. గ్రామంలో ఐకమత్యంగా తీసుకున్న నిర్ణయం ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎన్నికల సమయంలో కూడా మద్యపానం నిషేధం అమలు చేయడంతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది.

అరుణ శంకర్, మాజీ సర్పంచ్, ఇస్తాళాపురం

ఎన్ని శక్తులు అడ్డుపడినా..



పదేళ్లుగా మద్యం మూలాన అనారోగ్య మరణాలు జరిగాయి. ప్రతీ ఘర్షణకు మద్యం మత్తే కారణంగా ఉండేది. దీంతో గ్రామంలో మద్యపానం నిషేధించాలని నిర్ణయించుకున్నాం. ఎన్ని శక్తులు అడ్డుపడినా అమలు చేసి తీరుతున్నాం. గ్రామంలో ఎవరైనా తాగినా, ఇతర గ్రామాల నుంచి తెచ్చినా జరిమానా విధిస్తూ కఠినంగా వ్యవహరిస్తున్నాం.

గుండు చిన్న రమేష్, రైతు గట్టికల్ గ్రామం.

వివాదాలు తగ్గిపోయాయి

మండలంలోని ఇస్తాళాపురం, గట్టికల్ గ్రామాల్లో మద్యం నిషేదం అమలు కారణంగా మద్యం వివాదాల ఫిర్యాదులు పూర్తిగా తగ్గిపోయాయి. బెల్ట్‌షాప్‌లు లేకపోవడంతో ఆ గ్రామాల్లో ఘర్షణలు తగ్గి పంచాయతీల ప్రభావం కూడా అంతగా లేదు. ఈ రెండు గ్రామాల్లో మిగతా గ్రామాల కంటే 50శాతానికి పైగా నేరాలు తగ్గిపోయాయి. సాధారణంగా ఎక్కడైనా మద్యం కారణంగానే అధికంగా ఫిర్యాదులు వస్తాయి.

- శ్రీకాంత్ గౌడ్, ఎస్ఐ ఆత్మకూర్(ఎస్).

పశు మాంస వ్యర్థాల కంటైనర్ పట్టివేత

● డ్రైవర్ దురుసు ప్రవర్తనతో ఉద్రిక్తత



వ్యర్థాలను పరిశీలిస్తున్న పోలీసులు

భువనగిరి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తునిలోని ఓ జంతు వధశాల నుంచి హైదరాబాద్ పశువుల మాంస వ్యర్థాలను తరలిస్తున్న కంటైనర్‌ను ఆదివారం భువనగిరి బైపాస్‌రోడ్డుపై పట్టివేశారు. వ్యర్థాలను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న హిందూ సంఘాల కార్యకర్తలు బైపాస్ రోడ్డుపై కాపుకాసి పట్టుకున్నారు. అదే సమయంలో సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే కంటైనర్ డ్రైవర్ పోలీసులతో, హిందూ సంఘాల కార్యకర్తలతో దురుసుగా ప్రవర్తించడంతో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణ ఇన్స్‌పెక్టర్ ఎం.రమేష్, పశువైద్యాధికారి ప్రత్యూష కంటైనర్‌ను, పశు మాంస వ్యర్థాలను పరిశీలించారు. అనంతరం పోలీసులు డ్రైవర్‌ను, కంటైనర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మేమున్నామనీ.. మీకేంకాదనీ !

● విద్యార్థుల సేవలో స్వాన్ ● శ్రీకారం చుట్టిన విశ్రాంత గురువు ● ప్రస్తుతం 740 మంది విద్యార్థుల సభ్యత్వం ● స్ఫూర్తిదాయకంగా కార్యకలాపాలు

విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రయోజకులు అయ్యేందుకు వేదికైన పాఠశాలలను అభివృద్ధి చేయడమే ఎజెండాగా... ఆపదలో ఉన్న విద్యార్థులకు అండగా.. ఏర్పాటైన స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి (స్వాన్) విద్యార్థులకు భరోసానిస్తుంది. ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి ఆలోచన నుంచి ఈ సంస్థను విద్యార్థులే నిర్వహించడం విశేషం.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

కొంతమంది విద్యార్థులతో 2017లో ఏర్పాటైన ఈ సంస్థ ఏడేళ్లలో ఇంతింతై వటుడింతై అన్నట్లుగా 740 మంది సభ్యుల వరకు చేరింది. ఉత్తమ విద్యాభ్యాసం వైపు విద్యార్థులను ప్రోత్సహించడం, పాఠశాలలో అందుకు తగిన వాతావరణాన్ని, వనరులను కల్పించడంకోసం ఎన్నో స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తూ మన్ననలందుకుంటోందీ స్వాన్.

విద్యార్థులే...తమ పిల్లలుగా భావించి

నార్కట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 15 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేసిన మామిళ్ల సత్తిరెడ్డికి ఈ పాఠశాలన్నా... తమ శిష్యులన్నా అమితమైన ప్రేమ. ఉద్యోగ విరమణ పొందే వరకూ ఈ పాఠశాల, విద్యార్థులతో ఎంతో అనుబంధం పెంచుకున్న సత్తిరెడ్డి తన శేషజీవితాన్ని కూడా ఇదే పాఠశాల సేవకే అంకితం చేయాలనుకున్నాడు. తనకు సంతానం లేకపోవడంతో విద్యార్థులనే తమ పిల్లలనే భావనతో ఉపాధ్యాయ వృత్తిలో ఒదిగిపోయేవారు. ఈ స్వభావమే ఇక్కడ స్వాన్ సంస్థకు అంకురార్పణ కలిగించింది. తొలుత 2017లో హైదరాబాద్‌లో కొంతమంది విద్యార్థులతో సమావేశమయ్యారు. అనంతరం తన ఆలోచనలపట్ల ఆసక్తి కనబర్చే విద్యార్థులతో కలిసి 1995-2018 వరకు గల విద్యార్థులతో స్వాన్‌కు శ్రీకారం చుట్టారు.

రూ.7.68 లక్షల ఆర్థిక సాయం అందజేత

వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఆకస్మిక మరణం చెందిన లేదా గాయపడిన ఆయా బ్యాచ్‌లకు చెందిన 14మంది స్వాన్ సభ్యులకు గడిచిన రెండేళ్ల కాలంలోనే రూ.7.68లక్షల మేర ఆర్థికసాయం అందజేశారు.

నార్కట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చేయూత

ఓవైపు స్వాన్ సభ్యులకు అండగా నిలుస్తూనే మరోవైపు పాఠశాల అభివృద్ధికి విద్యార్థులను ప్రోత్సహించే స్ఫూర్తిదాయక కార్యక్రమాలకు స్వాన్ చేయూతనిస్తుంది. దాత లభిస్తే దాతల ద్వారా సమకూర్చడం, లేదా స్వాన్ నిధుల నుంచి పాఠశాలకు కావలసిన అవసరాలను తీరుస్తున్నారు.



విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్వాన్ సభ్యులు

ఇందులో భాగంగానే రూ.7,500తో పాఠశాల సైన్‌బోర్డు, నిర్వహణ ఫౌండేషన్‌తో రూ.20,000 విలువైన క్రీడా కిట్టు, సీజేఆర్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు విజ్ఞాన వికాస యాత్ర నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ ద్వారా వలంటీర్‌ను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా మండలంలోని 11 జడ్పీహెచ్‌ఎస్‌లన్నీ కలిపి ఏటా మండలస్థాయిలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచే ముగ్గురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కింద ప్రథమ స్థానం, ద్వితీయ, తృతీయ ర్యాంకుల్లో నిలిచే విద్యార్థులకు వరుసగా రూ.15,000, రూ.10,000, రూ.5,000 ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తున్నారు.

ప్రమాద బీమా సౌకర్యం

స్వాన్‌లో సభ్యత్వం ఉన్న వారికి రెండేళ్లుగా ప్రమాద బీమా సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. ఒకొక్కరికీ రూ.350 చొప్పున ఏడాదికి ప్రమాద బీమా వర్తింపజేస్తున్నారు. ఈ ప్రకారం మొత్తం 740 మంది సభ్యుల్లో 686 మంది విద్యార్థులు రూ.350ను చెల్లించి రెన్యూవల్ చేసుకున్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5లక్షల ప్రీమియం డబ్బులు ఈ బీమా కింద బాధిత కుటుంబానికి రానున్నాయి. ఒకవేళ ఆసుపత్రిలో చేరి మెడికల్ చికిత్స చేయించుకుంటే రూ.50,000 మెడికల్ రీయింబర్స్‌మెంట్ వచ్చేలా పథకాన్ని వర్తింపజేయనున్నారు.

స్వాన్ ఏర్పాటైందిలా..

నార్కట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 1995-2018 విద్యా సంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులే ఈ స్వాన్‌లో ప్రస్తుతానికి సభ్యులుగా ఉన్నారు. ప్రారంభంలో కేవలం వ్రేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉండే స్వాన్ సభ్యుల సంఖ్య ప్రస్తుత విద్యా సంవత్సరానికి 740కి చేరింది. ఇందులో సభ్యత్వం తీసుకోవాలనుకునే విద్యార్థి రూ.1,000 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కసారి సభ్యత్వం తీసుకుంటే మళ్లీ రెన్యూవల్ చేయాల్సిన అవసరంలేదు. స్వాన్‌లో శాశ్వత సభ్యుడిగా ఉండొచ్చు. ఈ మూలనిధితోనే విద్యార్థులకు చేయూతనిచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సభ్యత్వ రుసుము ద్వారా సేకరించిన మూలధనంలో రూ.5,00,000ను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మిగతా డబ్బులను స్వాన్ తరపున సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు.

ఆపదలో ఉన్న వారికి భరోసా కల్పిస్తాం



ఆపదలో ఉన్న స్వాన్ సభ్యులకు మేమున్నామనే భరోసా ఇచ్చేలా స్వాన్ కార్యకలాపాలు నిర్వహిస్తాం. నేను ఉపాధ్యాయుడిగా ఉన్న సమయంలో శిష్యులైన విద్యార్థుల సంక్షేమం పాఠశాల అభివృద్ధికోసమే స్వాన్‌ను ఏర్పాటుచేశాం. స్వాన్ సంస్థ నిర్వహణ కార్యక్రమాల ఆచరణలో కొందరు విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పనిచేస్తున్నారు. ఇదే సంస్థను ముందుకు తీసుకుపోతుంది. విద్యార్థులను విద్యతోపాటు వివిధరంగాల్లో నిష్ణాతులయ్యేలా తమవంతు సహకారం అందిస్తున్నాం.

మామిళ్ల సత్తిరెడ్డి, స్వాన్ వ్యవస్థాపకుడు

స్వాన్ సభ్యత్వాలను వెయ్యికి పెంచడమే లక్ష్యం



2027 విద్యాసంవత్సరం పూర్తయ్యే నాటికి స్వాన్ సభ్యత్వ సంఖ్యను వెయ్యికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఒక్కరితో చేయలేని సాయాన్ని వేయిమందితో సులభంగా చేయవచ్చు. విద్యార్థులను సమష్టిగా ఆదుకునే ఆలోచనే స్వాన్ ఆశయం. పావురాల సమూహంపై విసిరిన వేటగాడి వలలో చిక్కిన పావురాల్లో ఒక్క పావురమే వలతో తప్పించుకోలేదు. అదే పావురాలన్నీ సమష్టిగా ఉంటే వలతో ప్రమాదం నుంచి తప్పించుకునే సందేశమే స్వాన్ కార్యకలాపాలకు స్ఫూర్తి.

మెరుగు శ్రవణ్, స్వాన్ జనరల్ సెక్రటరీ

నృసింహ క్షేత్రంలో కార్తీక సందడి



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కొండపై కార్తీక సందడి నెలకొంది. సుమారు 50 వేల మంది భక్తులు దర్శించుకోగా ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శనం) క్యూలైన్లలో భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు నిండిపోయాయి. బస్టాండ్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ అనుమతించడంతో వాటి మధ్య నుంచి వెళ్లి బస్సులు ఎక్కేందుకు భక్తులు (ప్రయాణికులు) ఇబ్బందులు పడ్డారు. కొండపై ఉత్తర రాజగోపురం ఎదురుగా, శివాలయం, విష్ణుపుష్కరిణి, కొండ కింద సత్యదేవుడి వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, వైకుంఠద్వారం వద్ద మండపాల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కొండకింద ఆధ్యాత్మిక వాడ వ్రత మండపాల్లో 713 జంటలు వ్రతాలు ఆచరించాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 52,37,284 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కాగా, ప్రతి వారం కొండపైన నిర్వహించే సంగీత సభల్లో భాగంగా ఆర్.శేషురాజు (శేరిలింగంపల్లి, హైదరాబాద్) శ్రీకృష్ణ గారడీ హరికథ కాలక్షేపం, అర్చన నృత్య నికేతన్ (హైదరాబాద్) కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ విష్ణుపురాణం దివ్య ప్రవచనం చేశారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



గర్భాలయంలో ఉభయ క్యూలైన్లలోభక్తుల రద్దీ

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపి అర్చకులు నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అలాగే పాతగుట్ట స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు నిర్వహించారు. రాత్రి మహా నివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. మణవాళ మహాముడి తిరునక్షత్రం ఉత్సవం వైభవంగా పండితులు నిర్వహించా రు. ఉదయం స్నపన తిరుమంజన అభిషేకం, సేవకాలం నిర్వహించి సాయంత్రం పురప్పాడ్ సేవలో అర్చకస్వాములతో తిరువీధుల్లో ఊరేగించి ఆలయ ముఖ మండపంలో సేవ కాలం చేపట్టారు.

ప్రకృతి రంగుల చేనేత వస్త్రాలు అద్భుతం



రంగుల అద్దకాన్ని పరిశీలిస్తున్న లార్స్ నీల్సన్, స్వాతి

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి రంగుల చేనేత వస్త్రాలు, ప్రాచీన హస్తకళలు, వెదురుతో తయారు చేసిన వస్తువులు అద్భుతంగా ఉన్నాయని నార్వేకి చెందిన లార్స్ నీల్సన్, ఫ్యాషన్ డిజైనర్ స్వాతి బీంటే ప్రశంసించారు. యాద్రాది భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో జాతీయ పురస్కార గ్రహీత దుద్యాల శంకర్ ఇంటిని ఆదివారం వారు సందర్శించారు. ప్రకృతి నుంచి సేకరించిన మూలికలతో వస్త్రాలకు రంగులు అద్దే ప్రక్రియను, మగ్గంపై వస్త్రాలను నేసే విధానాన్ని వారు పరిశీలించారు. దండు మల్కాపురంలోని టెక్స్‌టైల్ పార్కులో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ కృష్ణమూర్తి నెలకొల్పిన హస్తకళల వర్క్‌షాప్ మినీ క్రాఫ్ట్‌ను సందర్శించారు. ప్రాచీన చేనేత హస్తకళలైన బాతిక్ బ్లాక్ స్క్రీన్ టై అండ్ డై పద్ధతుల్లో నేటి తరానికి అనుగుణంగా తయారు చేస్తున్న కాటన్ వస్త్రాలను పరిశీలించారు. ప్రకృతికి నష్టం కలిగించకుండా వెదురుతో నిత్యావసర వస్తువులు, కళాకాండాలు సృష్టిస్తూ పర్యావరణానికి మేలు చేస్తున్న శ్రావణ్‌ను వారు అభినందించారు.

శ్రీసరస్వతీ శతకం పుస్తకావిష్కరణ



శ్రీసరస్వతీ శతకం పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన కవి వడ్డేపల్లి రాజేశ్వర్ రచించిన 'శ్రీ సరస్వతీశతకం' పుస్తకావిష్కరణ ఆదివారం పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. జాతీ య తెలుగు సాహితీపీఠం ఆధ్వర్యంలో డాక్టర్ నలవోలు నర్సింహారెడ్డి అధ్యక్షతన ఈ పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్య క్రమానికి విశిష్టఅతిథిగా హాజరైన డాక్టర్ పోరెడ్డి రంగయ్య మాట్లాడుతూ భూదాన్‌పోచంపల్లిలో సహజమైన కవులు ఎందరో ఉన్నారని అన్నారు. రాజేశ్వర్ చేనేత వృత్తిలో ఉండి శతకం రాయడం గొప్ప విషయమన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రాధశ్రీ శతకంలోని పద్యాలతో ప్రసంగించి అలరించారు. కార్యక్రమంలో రావిరాల స్వామి, గుండు మధు, ఆటిపాముల రాఘవేంద్ర, భారత లవకుమార్, బైరు రామాంజనేయులు, నిజాం కళాశాల ప్రొఫెసర్ తడక యాదగిరి, పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు పీత శ్రీరాములు శ్రేష్ఠి, వెల్దండి సత్యనారాయణ, టి.లక్ష్మి శాంతారెడ్డి, వనజ, త్రివేణి సాహితీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న పండితులు

మఠంపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు చేపట్టారు. తదుపరి కల్యాణమూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేం చేయించి మాంగల్యధారణ, యజ్ఞోపవీతధారణ అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు బృందం, ఏఈవో గజ్వేల్లిరఘు, పర్యవేక్షకులు కే.నటరాజు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ విజేత వరంగల్



ప్రథమ బహుమతి అందుకుంటున్న వరంగల్ జట్టు క్రీడాకారులు

భువనగిరి గంజ్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 69వ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఎస్‌జీఎఫ్-19 బాలుర వాలీబాల్ పోటీల్లో వరంగల్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ప్రథమ స్థానం వరంగల్, ద్వితీయ స్థానం రంగారెడ్డి, తృతీయ స్థానంలో ఆదిలాబాద్ జట్లు నిలిచాయి. కార్యక్రమంలో పాల్గొన్న సీఎస్‌ఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో క్రీడలు నిర్వహించడం జిల్లాకే తలమానికమన్నారు. విజేతలకు రాష్ట్ర క్రీడల అబ్జర్వర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఆంజనేయులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ కళాశాల పీడీ, పీఈటీ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



వట్టిపల్లి మెయిన్ రోడ్డు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

మర్రిగూడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చౌరస్తాకి వెళ్లే రోడ్డు సమీపంలో మిషన్ భగీరథ కృష్ణా నీటి మెయిన్ పైప్‌లైన్ లీకవుతోంది. దీంతో నీరంతా పత్తి చేనులోకి వెళ్తున్నది. మెయిన్ పైపులైన్ లీకేజీ కావడం వల్ల ఆ ప్రాంతంలో పెద్ద గుంతపడి నీళ్లు కలుషితమవుతున్నాయి. గతంలో ఈ మెయిన్ పైప్‌లైన్ లీక్ కావడంతో అధికారులు మెయిన్ పైపునకు ఓ బస్తాను చుట్టి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వదిలివేసినట్లు ఆ గ్రామ ప్రజలు తెలిపారు.

అధికారులు పూర్తి స్థాయిలో దీనికి మరమ్మతు చేయక పోవడం ఈ పైపు లైన్ లీకేజీ అవుతుందని దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి లీకేజీ అవుతున్న మెయిన్ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్వర్ణగిరిలో వైభవంగా పూజలు



స్వామివారి సేవలో పాల్గొన్న భక్తులు

భువనగిరి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి సమీపంలోని స్వర్ణగిరిలో ఆదివారం వేంకటేశ్వర స్వామికి వైభవంగా నిత్య పూజలు, నిత్య కల్యాణం నిర్వహించారు. ధ్వజస్తంభంపై ఆకాశ దీపం వెలిగించారు. జలనారాయణుడికి హారతి పూజలు సమర్పించారు. కార్తిక పూజలు జరిపారు. తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించి సహస్ర దీపకాంతుల ఊయల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో రోజంతా భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 5 వేల మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శి ంచి అన్నప్రసాదం స్వీకరించారు.

దళితుల భూములు తీసుకోవద్దు

మోటకొండూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి దళితుల భూములను తీసుకోవద్దని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన స్థలాలను పరిశీలించేందుకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అక్కడికి వచ్చారు. ఈ క్రమంలో శ్రీనివాసు అక్కడికి చేరుకుని దళితులకు ఇచ్చిన భూములను ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకోవడం సరికాదని వాగ్వాదానికి దిగారు. దీంతో ప్రభుత్వం తీసుకున్న భూమికి బదులు పక్కకు భూమి ఇప్పించే విధంగా కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన స్థలాలు, సభాస్థల ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.

ఆధ్యాత్మికతకు ఆలవాలం

● హుజూర్‌నగర్ ఆధ్యాత్మిక చింతనలో ఓలలాడుతున్న భక్తులు ● ఆలయాల్లో కోటి దీపోత్సవాలు ● శివలింగంపై సూర్యకిరణాల ప్రకాశం

కార్తీకమాసంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. హుజూర్‌నగర్ ప్రాంతం ఆధ్యాత్మిక భక్తిభావంతో ఓలలాడుతోంది. హుజూర్‌నగర్ ప్రాంతంలోని అనేక శివాలయాల్లో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఓ వైపు దేవాలయాల్లో నిత్యపూజలు జరుగుతుండగా మరో వైపు శివభక్తులు, అయ్యప్ప భక్తులు మాలలు ధరించి ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్నారు. మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శివాలయంలో కార్తీకమాసం నెలరోజులు శివలింగంపై సూర్యకిరణాలు ప్రకాశిస్తుండడం ప్రత్యేకతను సంతరించుకుంది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో శ్రావణమాసంలో మూడురోజుల ముత్యాలమ్మతల్లి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దశాబ్దాల కాలంగా శ్రావణంలో గంగమ్మ జాతర అనంతరం పెద్దముత్యాలమ్మ, చిన్నముత్యాలమ్మ, కనకదుర్గదేవిలకు జాతర నిర్వహిస్తున్నారు. పేరు హుజూర్‌నగర్ అయినప్పటికీ వందల ఏళ్ల నుంచి ఇక్కడ పోచమ్మ కొలువుదీరి ఉండంతో పోంచర్లగా ఉన్న ఈ ప్రాంతమంతా ప్రజలు చల్లగా ఉండాలని, రైతులు పాడిపంటలతో తులతూగాలని కోరుతూ గ్రామదేవతను కొలుస్తున్నారు.

ఓవైపు కృష్ణానది పరవళ్లు

ప్రాచుర్యం కలిగిన హుజూర్‌నగర్ ప్రాంతం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. హుజూర్‌నగర్ పట్టణం ఆధ్యాత్మిక చింతనలో ఓలలాడుతుంది. హుజూర్‌నగర్‌కు సమీపంలో ఒక వైపు కృష్ణా నది, మరోవైపు మూసీనది, మరోవైపు సాగర్ జలాల పరవళ్ళు. సవ్వడి చేస్తుంటాయి. హుజూర్‌నగర్ పట్టణంలో అత్యంత కీలకమైనది శ్రీపార్వతీ సహిత భీమలింగేశ్వరస్వామి దేవాలయం. ఈ దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించగా ఆ, దేవాలయాన్ని పునర్నిర్మాణం చేశారు. మరొకటి కాకతీయుల కాలంలోనే నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి-శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం. వీటితోపాటు హుజూర్‌నగర్ మండలంలో బూరుగడ్డ గ్రామంలో ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయం. అదేవిధంగా బూరుగడ్డలోని శ్రీనల్లకట్ట సంతాన ఇష్ట కామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయం. అమరవరం గ్రామంలో అమరలింగేశ్వరస్వామి ఆలయం, లింగగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాలు పురాతన కాలం నాటి నుంచి నిత్య దీప, ధూప, నైవేద్యాలతో విరాజిల్లుతున్నాయి. ఈ ఆలయాలన్నీ ఎంతో ప్రాచుర్యం కలిగినవి. ముఖ్యంగా పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా లక్ష రుద్రాక్షలతో అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ఈ శివాలయంలో కోటి దీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.



కోటి దీపోత్సవం


పట్టణంలో 500 ఏళ్ల నాటి కనదుర్గదేవాలయంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్లగా ఈ రెండు దేవాలయాల్లో కోటి దీపోత్సవాలు నిర్వహిస్తుండగా మహిళా భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి కోటి దీపోత్సవాలను కన్నులారా తిలకిస్తున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో శివాలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో 30 రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆ పురాతన కాలం నాటి రామాలయంలో డిసెంబర్ 16 నుంచి జనవరి 16 వరకు ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసే శోభాయాత్రకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. శోభాయాత్ర జనవరి 8న నిర్వహించే కార్యక్రమంలో 8 వాహనాలపై శ్రీవేణుగోపాలస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, గోదాదేవి అమ్మవారు, ఆంజనేయస్వామి, విఖనస ముని, రామానుజస్వామి, చక్కర పెరుమాళ్లతో ఊరేగింపు నిర్వహిస్తుంటారు. అదేవిధంగా పుష్యమాసంలో పౌర్ణమిరోజున కనక దుర్గమ్మను శాఖాంబరదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. దాంతోపాటు విజయదశమి సందర్భంగా పట్టణంలోని కనకదుర్గదేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆలయంతోపాటు పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఫణిగిరి గట్టుపై శ్రీసీతారామచంద్రస్వామి వారి ఉత్సవాలను మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా వారంరోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు.

ఇక్కడి శివాలయం.. ప్రత్యేకం

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలోని శివాలయం ఎంతో ప్రత్యేకతకు, విశిష్ఠతను నెలకొన్న దేవాలయంగా విరాజిల్లుతుంది. ఈ దేవాలయంలో కార్తీకమాసం మొదటి రోజు నుండి చివరి రోజు వరకు సుమారు 30 రోజుల పాటు శివలింగపై ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 30 నిమిషాల పాటు సూర్యకిరణాలు ప్రకాశిస్తుంటాయి. బూరుగడ్డ అంటే భృగు మహర్షి తపస్సు చేసిన ప్రాంతం. ఆ మహర్షి పేరు మీదే ఆ గ్రామం నేటికీ విరాజిల్లుతుంది.

బూరుగడ్డ గ్రామంలో మరో చారిత్రాత్మక దేవాలయం నెలవై ఉంది. శ్రీఆదివరాహ, శ్రీలక్ష్మీనర్సింహ, శ్రీవేణుగోపాల దేవాలయం కొలువు తీరింది. ఒకే పీటంపై ముగ్గురు దేవతామూర్తులు నెలకొని ఉండడం ఈ దేవాలయం ప్రత్యేకత. అదే దేవాలయంలో 24 అడుగుల ఏకశిల అనంతపద్మనాభస్వామి దేవాలయం కొలువుదీరి ఉంది. కాకతీయుల కాలంలో సత్రం బొల్లంరాజు ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. మండలంలోని అమరవరంలో అమరలింగేశ్వస్వామి ఆలయం చరిత్రకు అనేక ఆనవాళ్లు ఉన్నాయి. ఈ దేవాలయం ఎంతో ప్రాధాన్యం కలిగిందిగా పేర్కొంటారు. ఇటీవల పట్టణంలో మహారుద్రాభిషేకం నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం మరింతగా పెరిగింది.

హుజూర్‌నగర్.. ఆధ్యాత్మికతకు మారుపేరు



హుజూర్‌నగర్ అంటేనే ఆధ్యాత్మిక ప్రాంతం. అతి పురాతన కాలంనాటి శివాలయం, రామాలయం, వందల సంవత్సరాల నాటి కనకదుర్గ దేవాలయం.. ఇలా ఎన్నో విశిష్ఠతలతో కూడిన పట్టణం ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుతుంది. శ్రావణమాసం మొదలుకొని కార్తీకమాసం, ధనుర్మాసం ఇలా అనేక మాసాలలో ఇక్కడ దేవాలయాలలో నిత్యపూజలతో భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిభావంతో మెలుగుతుంటారు. స్వయంభువుగా వెలసిన శ్రీసీతారామచంద్రస్వామి కొలువుతీరిన ప్రాంతమిది.

నరగిరినాథుని రంగభట్రాచార్యులు, అర్చకులు, హుజూర్‌నగర్

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారంను పురస్కరించుకొని పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం 5గంటలకు శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకాలు, జ్ఞాన సరస్వతి అమ్మవారికి అభిషేకాలు, రాత్రి 7గంటలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కళాశిక కుశలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

'కపాస్ కిసాన్' యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

మర్రిగూడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కపాస్ కిసాన్‌యాప్‌ను వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. ఈ యాప్ వల్ల సన్న, చిన్నకారులతో పాటు కౌలు రైతులు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. కపాస్ కిసాన్ ఆన్‌లైన్ ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు కాపాస్ కిసాన్ యాప్‌ను వెంటనే రద్దు చేసి రైతులకు అనుగుణంగా ఉండే విధంగా చూడాలని కోరారు.

అలంకారప్రాయంగా హైమాస్ట్ లైట్లు!

● నార్కట్‌పల్లిలోని ఫ్లై ఓవర్ వద్ద అంధకారం
● చీకట్లో పొంచి ఉన్న ప్రమాదం
● పట్టించుకోని హైవే యంత్రాంగం

నార్కట్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయ రహదారిపై పట్టణంలోని నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద ఉన్న భారీ హైమాస్ట్ లైట్లు అలంకారప్రాయంగా మారాయి. రాత్రి సమయంలో జంక్షన్ల వద్ద హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో జాతీయ రహదారిపై నుంచి అత్యంత వేగంగా ప్రయాణించే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్లాలన్నా లేక నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలన్నా ఈ ఫ్లైఓవర్ నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. పక్క రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతానికి కూడా వయా మిర్యాలగూడ నుంచి దాచేపల్లి గుంటూరు వరకు ఇక్కడి నుంచే అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరీ ముఖ్యంగా రాత్రి సయమంలో ప్రైవేట్ ట్రావెల్స్, భారీ లోడు వాహనాలు వెళ్తుంటాయి. ఈ పరిస్థితుల్లో జంక్షన్లు, ఫ్లైఓవర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా వెలగాల్సిన లైట్లు నార్కట్‌పల్లి వద్ద అలంకార ప్రాయంగా మారాయి. రాత్రి వేళ ఇరువైపులా ఎదురెదురుగా వచ్చే వాహనాల వెలుతురులోనే ఇక్కడ ముందుకు కదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రతీ రోజు రాత్రి పూట పెట్రోలింగ్ చేసే ఎన్‌హెచ్ వాహన సిబ్బంది ఈ సమస్యను సంబంధిత జాతీయ రహదారి విభాగం అధికారులు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి. ఎలాంటి ప్రమాదం సంభవించకముందే పోలీస్ శాఖ కూడా స్పందించి హైమాస్టు లైట్లను వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నార్కట్‌పల్లిలోని నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద వెలగని హైమాస్టు లైట్లు (వృత్తంలో)

హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద ఉన్న హైమాస్ట్ లైట్లు వెలగక పోవడంతో చీకట్లో చాలా సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందని కొందరు ప్రయాణికులు తమ దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడే కాకుండా జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి పీఎస్ పరిధిలో వెలగని హైమాస్ట్ లైట్ల సమస్యను ఎస్పీ గారి ద్వారా సంబంధిత ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

- దగ్గుల క్రాంతికుమార్, ఎస్‌ఐ, నార్కట్‌పల్లి

అంధకారంగా ఉంది



నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నల్లగొండ రోడ్డు శివారులో ఉన్న జాతీయ రహదారికి సంబంధించిన ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు రోజుల తరబడి వెలగడం లేదు. హైవేకు ఇరువైపులా ఉన్న రెండు సర్వీస్ రోడ్ల వెంబడి రెండు వైపులా ఉన్న రెండింటిలో కనీసం ఒక్క హైమాస్ట్ లైట్ కూడా వెలగడం లేదు. హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఇక్కడ బస్సుల కోసం నిలబడుతూ చీకట్లో ఇబ్బందుల పడుతున్నారు. ప్రమాదం లేదా నష్టం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

- చొల్లేటి శ్రీనివాసచారి, నార్కట్‌పల్లి

యువత సామాజిక సేవలో పాల్గొనాలి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డి అన్నారు. చిట్యాలలో యువశక్తి యువజన సంఘం సభ్యులు సిలివేరు చంద్రశేఖర్, కంబాలపల్లి నరేష్ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజహితం కోసం పాటుపడాలని ఆయన సూచించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదాన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు ఐలాపురం నరేష్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి మద్ది మధు, గుండ్లపల్లి వెంకన్న, చింతపల్లి ప్రవీణ్, సిలివేరు పరమేష్, బొడ్డుపల్లి శ్రీను, ఉపేందర్, ఆవుల మహేష్, నిమ్మనగోటి శ్రీను పాల్గొన్నారు.

వర్షానికి తెగిన ఊట్కూరు బండమీదిగూడెం రోడ్డు

● రాకపోకలకు అంతరాయం - ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు


తెగిపోయిన ఉట్కూర్ నుంచి బండమీదిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు

శాలిగౌరారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూర్ నుంచి బండమీదిగూడెం వెళ్లే ప్రధాన రోడ్డు శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పూర్తిగా తెగిపోయింది. దీంతో బండమీదిగూడెం గ్రామ ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు గుంతమయంగా మారి సంవత్సరాలవుతున్నా మరమ్మతులు చేయించడంలో పాలకులు, అధికారులు పట్టించుకోవ డం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊట్కూర్ నుంచి బండమీదిగూడెం 3కిలోమీటర్లు ఉంటుంది. గతంలో కురిసిన వర్షాలకే రోడ్డు కొంతభాగం దెబ్బతిన్నది. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు రావడంతో రోడ్డు పూర్తిగా తెగిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్లా శ్రీలతరెడ్డి

శాలిగౌరారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన రెబ్బ ఉదయ్‌తో మరికొంత మంది సూర్యాపేట జిల్లా పార్టీ అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రధాని చేయని విధంగా నేటి ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధి, దేశ రక్షణ కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్, బీజేపీ మండల నాయకులు అయితగోని గణేష్, ఆకుల రవి, కుక్కడపు సందీప్ పాల్గొన్నారు.

రాధేయ సాహిత్యసేవలు చిరస్మరణీయం

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాతృ కవి రాధేయ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రముఖ సాహితీవేత్త ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించన మాతృమూర్తి రాచమల్ల లచ్చమ్మ, మాతృకవి రాధేయమారక పురస్కారాల ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లి పేరు మీద అవార్డులు ఇవ్వడం తెలుగు సాహిత్యచరిత్రలో స్ఫూర్తిదాయకమన్నారు. లచ్చమ్మ పురస్కారాన్ని ప్రముఖ ప్రజాకవి జయరాజుకు, రాధేయ పురస్కారాన్ని ప్రముఖ అష్టావధాని అవుసుల భానుప్రకాష్‌కు అందజేశారు. డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆచార్య శ్యాంసుందర్, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, పెరమాళ్ల ఆనంద్, అంజయ్య, అనిత కుమారి, ఐలయ్య, సాగర్లసత్తయ్య, శ్రీవాణి, రాధాకిషన్, చంద్రకళ, శ్రీరాములు, బుచ్చిరెడ్డి, మల్లిఖార్జునచారి తదితరులు పాల్గొన్నారు.

'గుమ్ములకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి'

కనగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని జడ్పీ మాజీ కోఆప్షన్‌ఎండీ జియావుద్దీన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా గుమ్ముల మోహన్‌రెడ్డి వివిధ హోదాల్లో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో వైభవంగా సామూహిక కుంకుమ పూజలు

కనగల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య సంఘం తరఫున సుమారు 40మంది దంపతులతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి దంపతులు, ఈవో అంబటి నాగిరెడ్డి, ఆర్య వైశ్యసంఘం జిల్లా, మండల అధ్యక్షుడు, ఇతర కమిటీ సభ్యులు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


కట్టంగూరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కట్టంగూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్స్ ఆధ్వర్యంలో స్కంద లైఫ్ లైన్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు, వృద్ధులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతి ఒక్కరూ సంవత్సరంలో రెండు సార్లు ఆరోగ్య పరీక్షలు చేసుకొని వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు సుమారు 200 మంది రోగులకు రక్త, మూత్ర పరీక్షలు, ఈసీజీ, హిమోగ్లోబిన్, మధుమేహం, యూరిక్ యాసిడ్, సంతాన సాఫల్యతతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కంద లైఫ్ లైన్ ఆస్పత్రి వైద్యులు కొత్తమాస్ సొంబాబు, రాగమాలిక దేవి, ప్రవీణ్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పోగుల రాములు, సభ్యులు మంగదుడ్ల శ్రీనివాస్, కడవేరు మల్లికార్జున్, రాపోలు వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి వెంకన్న, గోశిక ఉమాపతి, రొయ్య నవీన్, ఆస్పత్రి సిబ్బంది సింగం శివ, వనం సువర్ణ, అంబటి జానకి రాములు, చిరుమర్తి రామ్‌చరణ్, పి.సరిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌డ్రామా ఫెస్టివల్

జాతీయ స్థాయి ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

నల్లగొండటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సదరన్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్ జాతీయ స్థాయి ప్రదర్శనకు నల్లగొండలోని ఆర్పీ రోడ్డులో గల జిల్లా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా ప్రదర్శనలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు నవంబరు 19 నుంచి 21వ తేదీ వరకు బెంగుళూరులో జరిగే దక్షిణ భారత స్థాయి సైన్స్ డ్రామా ప్రదర్శనలో పాల్గొననున్నారు. జాతీయస్థాయి డ్రామాకి ఎంపిక కావడానికి కృషి చేసిన గైడ్ టీచర్ కె.పూర్ణిమ, హెచ్‌ఎం తేర ఇప్పత్‌లకు డీఈవో బొల్లారం బిక్షపతి, జిల్లా సైన్స్ ఆఫీసర్ వనం లక్ష్మీపతి అభినందించారు. అదేవిధంగా జాతీయస్థాయిలో కూడా చక్కటి ప్రదర్శన కనబరిచి మన జిల్లాకి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి


గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వెదిరే మేఘారెడ్డి

మునుగోడురూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత గ్రంథాలయాలను వినియోగించుకొని భవిష్యత్తులో మంచిస్థాయిలో స్థిరపడి ఊరికి మంచిపేరు తేవాలని వెదిరే పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరే మేఘారెడ్డి, పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్, కొంపల్లి వెదిరే విజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో నోస్క్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో గ్రంథాలయాల ప్రాముఖ్యతను గుర్తించి ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వామి, మాజీ సర్పంచ్ జాల వెంకన్న, గ్రామ పెద్దలు హనుమయ్య, అప్పారావు, బత్తుల శ్రీను, దాము యాదయ్య, బీముడు మల్లయ్య, సూర శంకర్, యాదయ్య, సంకు శంకర్, మనోజ్, దశరథ, సైదులు, శంభు గౌడ్, ప్రసాద్, సురేందర్, గిరి, కృష్ణ, నరేష్, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని రోజులు ఈ ఇబ్బందులు!

(5వ పేజీ తరువాయి)

కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌లకు వెబ్‌సైట్ సహకరించకపోవడంతో రిజిస్ట్రేషన్లు వాయిదాపడుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల కారణంగా డాక్యుమెంట్ల అప్‌లోడ్ కూడా ఆలస్యమవుతోంది. కొన్నిసార్లు అయితే ఒక్క డాక్యుమెంట్‌ను నాలుగైదు సార్లు ప్రయత్నిస్తే తప్ప అప్‌లోడ్ కావడం లేదు. వెబ్‌సైట్‌లో లోపాలతో ఓటీపీ రాకపోవడం, డిజిటల్ సంతకాలకు ఆలస్యమవడం జరుగుతోంది. ఇప్పటికైనా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సాంకేతిక సమస్యలు అధిగమించడానికి సర్వర్ సామర్థ్యం పెంచడంతో పాటు ఇంటర్‌నెట్ వేగాన్ని పెంచాలని, బ్యాకప్ సర్వర్ వంటివి ఏర్పాటుపై దృష్టిపెడితేనే ఆస్తుల క్రయ, విక్రయదారుల సమస్యలు తొలగుతాయని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : వీరేశం


నోములలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని నోముల, వల్లభాపురం గ్రామాల్లో తాటికల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. రైతులు కష్టపడి పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, కోఆపరేటివ్ సీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు సామ సత్తిరెడ్డి, శేఖర్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, యాస కర్ణాకర్ రెడ్డి, కందాళ వెంకట్‌రెడ్డి, కుంచెం సోమయ్య, సూదమల్ల సురేందర్, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివలింగాల ప్రతిష్ఠాపన

● యజ్ఞం నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, వనభోజనాలు


ప్రతిష్ఠించిన శివలింగానికి అభిషేకం చేస్తున్న నిర్వాహకులు, భక్తులు

చిట్యాలరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం తాళ్లవెల్లంలలో ఆర్గానిక్ కృష్ణ మందిరంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ఆదివారం శివలింగాల ప్రతిష్ఠాపన మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పచ్చనిచెట్ల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆర్గానిక్ కృష్ణ మందిరం సమీపంలో నిర్మించిన శివాలయం ప్రాంగణంలో ప్రథమ పూజితుడైన గణపతి పూజ, కలశస్థాపన, వేదపారాయణంతో కార్యక్రమాలు ప్రారంభమై శివలింగ ప్రతిష్ఠ యజ్ఞం జరిపించారు. శివాలయంలోని గర్భగుడిలో బ్రహ్మసూత్రం శివలింగ ప్రతిష్ఠాపనను వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల భక్తిశ్రద్ధల నడుమ నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోనే నర్మదా నది నుంచి తీసుకువచ్చిన బాణలింగాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం శివలింగాలకు ప్రత్యేక పూజలు అభిషేకాలను నిర్వహించారు. అభిషేకాలు పూజలు పూర్తయ్యాక భక్తులు దర్శించుకున్నారు. హర హర మహా దేవ.. ఓం నమఃశివాయ అంటూ పంచాక్షరీ మంత్రాలు, శివనామస్మరణలు మార్మోగడంతో ఆలయం ఆధ్యాత్మిక భక్తి వాతావరణాన్ని కలిగించింది.

శివలింగ ప్రతిష్ఠ మహోత్సవం భక్తుల హృదయాలను ఆనందంలో నింపింది. శివలింగాల ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. నృత్య కళాకారులు పరమశివవుడు, శ్రీకృష్ణుడికి సంబంధించిన గేయాలపై నృత్యరూప ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. సంగీతం, భజనలు, వేదఘోషలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కలిగించింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తులకు వనభోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పామనగుళ్ల వెంకటేశ్వర్లు, ఎం.రాజేంద్రకుమార్, ప్రదీప్ రెడ్డి, ఎ. అమర్‌నాథ్‌రెడ్డి, సి.శ్యాంసుందర్‌రెడ్డి, వి.జలంధర్, నరేందర్, టి.భిక్షం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటిచూపునకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి

● డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి



వట్టిమర్తిలో కళ్ల అద్దాలను పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చిట్యాలరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కంటిచూపుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తిలో నర్రా బుచ్చిరెడ్డి జ్ఞాపకార్థం, జడ్పీహెచ్ఎస్‌లో 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పక్షం రోజుల ముందు ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోళ్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కంటిచూపు లేకుంటే అంధకారమేనని, ఎవరైనా కంటిచూపులో సమస్యలు ఉంటే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కంటి పరీక్షలను చేయించుకోవాలని అన్నారు. వైద్యుడి సలహా మేరకు మందులు, కళ్లద్దాలను వాడాలన్నారు. కంటిచూపు మెరుగునకు ఆహార పదార్థాలు, కూరగాయలు, ఆకుకూరలు కూడా ముఖ్యమైనవని వాటిని తీసుకోవాలని అన్నారు. అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా మోహన్‌రెడ్డి, నాయకులు నర్రా రవీందర్‌రెడ్డి, బూరుగు వెంకన్న, నర్రా భిక్షంరెడ్డి, చింతపల్లి వెంకన్న, రాచకొండ రఘు, మేడి నర్సింహ, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు లక్కీడ్రా నేడు


(5వ పేజీ తరువాయి)

ప్రధానంగా జాతరలు, పారిశ్రామికప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని దుకాణాలకు ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఇక్కడ లక్కీడ్రా రూపంలో అదృష్టం ఎవరిని వరించనుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం

జిల్లాలో మద్యం దుకాణాల నిర్వాహకుల ఎంపికకు సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహిస్తాం. ఇందుకోసం హైద్రాబాద్‌రోడ్డులోని లక్ష్మీగార్డెన్స్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. దరఖాస్తుదారులు, వారు అనుమతించిన ఆధీకృత వ్యక్తులు ఉదయం 10లోపే అక్కడకు చేరుకోవాలి. 11 గంటలకు డ్రా కార్యక్రమం మొదలవుతుంది. డ్రాలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు వచ్చే రెండేళ్ల మద్యందుకాణాల నిర్వహణకు అనుమతిస్తాం. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా దుకాణాలు నడపాల్సి ఉంటుంది. నిబంధనలు అతిక్రమించినా, ఆటంకాలు కల్పించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- బి.సంతోష్‌కుమార్, జిల్లా ఎక్సైజ్ అధికారి



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	37,867	37,867
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.8661)	36,275	58,214

చికెన్ ధరలు | లైవ్ : రూ.150 | డ్రెస్ : రూ.240 | స్కిన్‌లెస్ : రూ.260



» జిల్లాలో 154 దుకాణాలకు నిర్వాహకుల ఎంపిక
» కలెక్టర్ సమక్షంలో డ్రా
» ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



మద్యం దుకాణాలకు లక్కీడ్రా నేడు

నల్లగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఎక్సైజ్ సంవత్సరం 2025-27కు సంబంధించి మద్యం దుకాణాల నిర్వాహకుల ఎంపిక సోమవారం జరగనుంది. అందుకోసం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీగార్డెన్స్‌లో ఎక్సైజ్ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 154 దుకాణాలకు మొత్తం 4,906 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఉదయం 11గంటల నుంచి దుకాణాల వారీగా లక్కీడ్రా కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో నిర్వహించనున్నారు. ఒక్కో దుకాణం వారీగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఆధారంగా కూపన్లను ఏర్పాటు చేసి డ్రా తీస్తారు. డ్రాలో అదృష్టం ఎవరిని వరిస్తే వారికే రానున్న రెండేళ్లపాటు ఆ దుకాణం నిర్వహించుకునేందుకు అనుమతి మంజూరవుతుంది. ఉత్కంఠభరితంగా డ్రా జరగనుండడంతో దరఖాస్తుదారులు లేదా వారి అధీకృత వ్యక్తులను మాత్రమే డ్రా తీసే హాల్‌లోకి అనుమతిస్తారు. లక్కీడ్రాలో ఎంపికైన లైసెన్స్‌దారులకు ఈ ఏడాది డిసెంబరు 1, నుంచి 2027 నవంబరు 30 వరకు ఆయా దుకాణాల్లో మద్యం వ్యాపారం నిర్వహించుకునేందుకు అనుమతిస్తారు.

అధికంగా వ్యాపారం జరిగే దుకాణాలపైనే అందరి దృష్టి

జిల్లాలో మద్యం దుకాణాలకు గతం మాదిరిగా ఈసారి దరఖాస్తులు తగ్గినా పోటీమాత్రం బలంగానే ఉంది. 154 దుకాణాలకు ఎస్టీలకు 4,ఎస్సీలకు 14, గౌడసామాజికవర్గానికి 34 దుకాణాలు కేటాయించగా, మిగిలిన దుకాణాలను ఓపెన్ కేటగిరీలో ఉంచారు. జిల్లాలో మద్యం వ్యాపారం ఎక్కువగా జరుగుతుందని భావించే దుకాణాలకు టెండర్లు సైతం అదేరీతిలో భారీగా వచ్చాయి. నల్లగొండ డివిజన్‌లోని దర్వేశిపురం దుకాణానికి 154 దరఖాస్తులు రాగా, వెలిమినేడు దుకాణానికి 82, కంచనపల్లికి 74దరఖాస్తులు వచ్చాయి. చండూరు, నందికొండల్లోని దుకాణాలకు అత్యల్పంగా 18 చొప్పున దరఖాస్తులు రాగా, తిరుమలగిరి, నాంపల్లి, మర్రిగూడ, నందికొండ, నకిరేకల్ దుకాణాలకు 19 చొప్పున, నకిరేకల్, చండూరు, మునుగోడులోని మూడు దుకాణాలు, హాలియా దుకాణాలకు 20 చొప్పున, పీఏపల్లి, నకిరేకల్, త్రిపురారం, మర్రిగూడ, నాంపల్లిలోని దుకాణాలకు 21 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

- మిగతా 8వ పేజీలో...



ఉమ్మడి జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యాలయంలో పలు సాంకేతిక సమస్యలతో ఆస్తుల క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడు నిమిషాల్లో పూర్తి కావల్సిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గంటన్నర నుంచి రెండు గంటల వరకూ పూర్తికాకపోవడంతో సంబంధితశాఖ అధికారులు, సిబ్బంది, ఆస్తుల క్రయ, విక్రయదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఎన్ని రోజులు ఈ ఇబ్బందులు!

» ఏడు నిమిషాల్లో పూర్తి కావల్సిన డాక్యుమెంట్‌కు రెండు గంటలు
» ఇంటర్‌నెట్ స్లోకావడంతో ఇబ్బందులు
» ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి

రిజిస్ట్రేషన్లశాఖలో కొత్త కొత్త విధానాలు తీసుకువస్తుండటంతో ఉన్న సమస్యల పరిష్కారానికి బదులు కొత్తఇబ్బందులు ఎదురవుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ మూడు నాలుగుసార్లు థంబ్ వేయడం, ఆస్తుల క్రయ, విక్రయదారులు సైతం అదే స్థాయిలో వేలిముద్ర లు వేయడంతో పాటు ఫొటోలు మూడు, నా లుగుసార్లు దిగాల్సి వస్తోంది. కేవైసీ సైతం చేయాల్సి ఉంటోంది. గతంలో స్లాట్ బుకింగ్ లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని భావించిన ప్రభుత్వం స్లాట్ బుకింగ్ తీసు వచ్చినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రోజుకు 46వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యే లా స్లాట్ బుకింగ్ చేసుకునే వీలుంది.వారికి నిర్ధారించిన సమయంలోనే వచ్చి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అయితే సమయానికి వచ్చినా, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని క్రయ, విక్రయదారులు వాపోతున్నారు.

ఇంటర్‌నెట్ వేగం పెంచకపోవడంతో...

స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖలో వేగవంతంగా పనులు పూర్తయ్యేందుకు అత్యధిక వేగం ఉన్న బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్‌నెట్ అవసరం. అయితే ఇంటర్‌నెట్ స్లోగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడూ తర చూ సర్వర్ డౌన్ అవుతోంది. ఈనెల 22, 22 తేదీల్లో రిజిస్ట్రేషన్ శాఖలో మొత్తంగా సేవలు నిలిచిపోయాయి. ఈరెండు రోజులు రిజిస్ట్రేషన్‌శాఖవెబ్‌సైట్ మొరాయించడంతో చలానా, ఈసీలు,సీసీలు, మార్కెట్ విలువ, చివరికి స్లాట్ బుకింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. సర్వర్ బీజీతో గంటల తరబడి పనులు నిలిచాయి. రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించి వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో పాటు సర్వర్ మొరాయించడంతో సకాలంలో పనులు జరగడం లేదు. నెల రోజులుగా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నా రాష్ట్ర స్థాయి అధికారులు పరిస్థితులను సరిదిద్దకపోవడంతో సేవలు ఆలస్యమవుతున్నాయి.

20ఏళ్ల క్రితం రూపొందించిన సాఫ్ట్‌వేర్..

స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖలో 20 ఏళ్ల క్రితం రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఆధారంగానే వెబ్‌సైట్ పని చేస్తోంది. సాంకేతికంగా అనేక మార్పులు వచ్చినా ఈ వెబ్‌సైట్‌లో మాత్రం మార్పులు చేయలేదు. దీంతో సాంకేతిక సమస్యలు ఎదురై వెబ్‌సైట్ మొరాయిస్తుండటం, ఒక్కోసారి సర్వర్ డౌన్ అవుతోంది. దాన్ని చక్కదిద్దే సరికి గంటల సమయం పడుతోంది. చలానా తీసేందుకు గంటల తరబడి ఎదురుచూడలేక కొంత మంది ఆస్తుల క్రయ, విక్రయదారులు మరుసటి రోజు రిజిస్ట్రేషన్‌కు వస్తున్నారు. ప్రతీ రోజు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 800 నుంచి 1,000 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. ప్రస్తుతం సాంకేతిక సమస్యలతో అందులో 50శాతం డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కూడా పూర్తవడం లేదు. ఈసీలు డౌన్‌లోడ్ కాక చాలా మంది ఎదురుచూస్తున్నారు.....

- మిగతా 8వ పేజీలో...

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావద్దు: కలెక్టర్



నల్లగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు రోజుల్లో మెంథా తుపాను ప్రభావం జిల్లా లో తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రానున్న రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలోని ఆరు జిల్లాలో మెంథా తుపాను కారణంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. జిల్లాలో కూడా ఆ ప్రభావం ఎక్కువగానే ఉండనున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేలాడే విద్యుత్ వైర్లు, వంగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం ఉన్నందున వా టి సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల కు తడిసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకురావద్దన్నారు. రానున్న మూడు రోజులు తహసీల్దార్లు వారు పనిచేసే స్థానాల్లోనే ఉండాలని, ఇప్పటికే సెలవు దరఖాస్తు చేసి ఉంటే వాటిని రద్దు చేస్తున్నట్టు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ఎగుమతి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు వారి పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలను సిద్ధం చేయాలన్నారు. 27న మధ్యాహ్నం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి ధాన్యాన్ని ఎగుమతి చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. మెంథా తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ఉండేలా గ్రామ పాలనాధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏజెన్సీలు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీసీవో పత్యానాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయదేవి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం



నకిరేకల్‌లో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంత ఏర్పడుతుందని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆడిటోరియంలో ఆనందోబ్రహ్మ యోగా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ వ్యక్తి నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. అప్పుడే మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆనందోబ్రహ్మ యోగామండలి బాధ్యులు మిర్యాల చల్మరాజు, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాళ పాపిరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఆరాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు నిధుల వరద

- ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు రూ.285కోట్లు
- నిధుల విడుదలకు ఆమోదముద్ర వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కో మునిసిపాలిటీకి రూ.15కోట్లు
- వచ్చే మార్చి నాటికి పనుల పూర్తి లక్ష్యం

6లో..

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో నల్లగొండ పాత్ర కీలకం

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్



శాలిగౌరారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

శాలిగౌరారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ నేత చామల జైపాల్‌రెడ్డి నివాసంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకున్నందున రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సీఎంగా రేవంత్‌రెడ్డి ఎన్నికయ్యారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారెంటీలను అంచెలంచెలుగా సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌కు తెలియజేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలను అర్థం చేసుకోకుంటే తిరిగి అధికారంలోకి రావడం కష్టంగా ఉంటుందనే అభిప్రాయాన్ని పార్టీ పెద్దలకు తెలియజేస్తానన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి గ్యాప్ ఏర్పడినందునే పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రాలేదన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ నాయకులపై అహంకారపూరితంగా, బూతులు మాట్లాడటం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, బండపెల్లి కొమరయ్యగౌడ్, చమల జైపాల్‌రెడ్డి, చింత ధనుంజయ, నారగోని అంజయ్య, వడ్లకొండ పరమేష్ గౌడ్, బొల్లికొండ గణేష్, పుల్లూరు దేవేందర్, నిమ్మల కృష్ణ, కడారి అంజయ్య, జమ్ము అశోక్, పోల్‌దాస్ నరేష్, వేముల భరత్, అన్నెబోయిన అనిల్, ఇబ్రహీం, గంధసిరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధుయాష్కిగౌడ్ తుడిమిడి గ్రామంలో పవన్‌సాయి ఆస్పత్రి అధినేత ఆలేటి శ్రీనివాస్ మాతృమూర్తి లింగమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మనలో చైతన్యం లేకే అగ్రవర్ణాల ఆధిపత్యం

ఆర్‌ఎల్డీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్

నల్లగొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో చైతన్యం లేకపోవడం వల్లే అగ్రవర్ణాల ఆధిపత్యం నడుస్తోందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ (ఆర్‌ఎల్డీ) రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సామాజిక చైతన్య రథయాత్ర ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్ర సాధన కోసం 98శాతం బడుగు వర్గాలే ప్రాణాలు కోల్పోయారని, అయినా బహుజన తెలంగాణ రాలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు తెలంగాణలో ఒరిగిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, సంతోష్‌రావు అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు సంపాదించారని కల్వకుంట్ల కవిత ఆరోపించారని గుర్తుచేశారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చి ఆయనకు వెన్నుపోటు పొడిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల చెందిన అభ్యర్థులు పోటీచేయాలన్నారు. ఇతర పార్టీల నుంచి బీ-ఫాం లభించని వారు తనను సంప్రదిస్తే ఆర్‌ఎల్డీ పార్టీ నుంచి బీ-ఫాం ఇస్తానని హామీ ఇచ్చారు. బలహీనవర్గాలు ఏకమైతేనే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్ పరిశ్రమల్లో 95శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, రాజీవ్ యువ వికాసం కింద రూ.5లక్షలు యువకులకు రుణం ఇవ్వాలని, నిరుద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఆర్‌ఎల్డీ పార్టీ నాయకులు ముద్దం మల్లేష్, నందిపాటి జానయ్య, నర్సింగ్‌రావు, సుధాకర్, బీరప్ప, కోరే సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామనీ.. మీకేంకాదనీ !

» విద్యార్థుల సేవలో స్వాన్
» శ్రీకారం చుట్టిన విశ్రాంత గురువు
» ప్రస్తుతం 740 మంది విద్యార్థుల సభ్యత్వం
» స్ఫూర్తిదాయకంగా కార్యకలాపాలు

7లో..

వ్యాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ



మిర్యాలగూడలో మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు అన్యాయం చేసేలా రూపొందించిన వ్యాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన పెన్షనర్ల సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. 2026 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం వ్యాలిడేషన్ చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దీంతో పాత పెన్షన్‌దారులకు బెనిఫిట్స్ ఇవ్వకుండా, కొత్తగా రిటైర్మెంట్ అయ్యే వారికి మాత్రమే బెనిఫిట్స్ వర్తించేలా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావాలని చూస్తోందన్నారు.

ఈ చట్టం అమలులోకి వస్తే పాత పెన్షన్‌దారులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టాన్ని రద్దుచేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ యాక్ట్-2025ను రద్దుచేసి ఈపీఎస్ పెన్షన్‌దారులకు కనీస వేతనంగా రూ.9వేలు చెల్లించి హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యుటీ రూ.20లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ని 12ఏళ్లకు కుదించి, రూ.398 వేతనంతో పనిచేసిన టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్, పెన్షన్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించడంతోపాటు నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ పోరాటాలకు సంఘటితంగా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, వాడపల్లి రమేష్, పందిరి శ్యాంసుందర్, పులి కృష్ణమూర్తి, రామావతారం, సత్యనారాయణ, మల్లుగౌతమ్‌రెడ్డి, రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, మరణారెడ్డి, సత్యనారాయణరావు, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్

నల్లగొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 14లక్షల మంది కళాశాలల విద్యార్థులకు రూ.5వేల కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రెండేళ్లుగా ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. పెరిగిన ధరల ప్రకారం స్కాలర్‌షిప్ పెంచాలన్నారు. ప్రభుత్వం బీసీలకు బడ్జెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రెండేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్సు పూర్తయినా కొన్ని యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో పేద విద్యార్థుల చదువు దెబ్బతింటోందన్నారు.

పీసీ కోర్సు చేసిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగాలు పొందిన, విదేశాల్లో ఉద్యోగాలు వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు చదువుకుంటే సంపన్న వర్గాల దోపిడీ పాలన అంతమవుతుందని భయపడుతున్నారని, పేదల్లో చైతన్యం పెరిగి రాజ్యాధికారం దిశగా ఉద్యమాలు వస్తాయని అగ్రవర్ణ పాలకవర్గాలు భయపడుతున్నాయని విమర్శించారు. పెరిగిన ధరల ప్రకారం విద్యార్థుల మెస్ చార్జీలు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఏడాదికి రూ.5,500 నుంచి రూ.20వేలకు, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు రూ.6,500 నుంచి రూ.20వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారింగ్ నరేష్ గౌడ, కన్నబోయిన రంజిత్‌యాదవ్, జక్కల పరమేష్, ఆవుల ప్రశాంత్, సతీష్, పృథ్వీరాజ్, అంద రాకేష్, ఎర్రబోయిన గణేష్, నిఖిల, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తి

చింతపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని మోద్దులమల్లేపల్లిలో సీతారామచంద్ర స్వామి ఆలయ శంకుస్థాపనకు నిర్వాహకులు ఆదివారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో మట్టిని చదును చేసి చలువ పందిర్లు వేసి ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఆధ్యాత్మికవేత్త త్రిదండి చిన్నజీయర్ సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయ శంకుస్థాపన చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రిజర్వేషన్ అమలుచేశాక ఎన్నికలు నిర్వహించాలి

చింతపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేశాక ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలపరిధిలోని వెంకటేశ్వరనగర్ (మాల్)లో ఆదివారం ఆయన మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదగోని కృష్ణగౌడ్, గనగోని అశోక్‌యాదవ్, వెంకటేశ్వర్లు, రాజీవ్‌గాంధీ, వినీత్, సాయి, ప్రసాద్, అశోక్, కృష్ణ, విజేందర్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం

దేవరకొండ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి డీఎం సైదులు



ఇంటర్వ్యూ Interview

దేవరకొండ ఆర్టీసీ డిపో పరిధిలోని రోడ్డు సౌకర్యం ఉన్న అన్ని గ్రామాలకు ప్రయాణికుల కోరిక మేరకు బస్సులు నడుపుతామని దేవరకొండ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ పడాల సైదులుయాదవ్ అన్నారు. డిపో నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: దేవరకొండ డిపోలో ఎన్ని బస్సులు నడుస్తున్నాయి, ఎంత మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు?

డీఎం: 1936లో దేవరకొండ ఆర్టీసీ డిపో ఏర్పాటైంది. డిపోలో ప్రస్తుతం 107 బస్సులు నడుస్తున్నాయి. మొత్తం 383 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ప్రతీ రోజు ఎన్ని కిలోమీటర్లు బస్సులు నడుస్తున్నాయి?

డీఎం: దేవరకొండ డిపో నుంచి ప్రతీరోజు 43వేల కిలోమీటర్లు బస్సులు నడుస్తున్నాయి. రోజుకు దాదాపుగా రూ.26 నుంచి 28 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

ఆంధ్రజ్యోతి: డిపో నుంచి పుణ్య క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నారా?

డీఎం: దేవరకొండ డిపో నుంచి తిరుపతి, యాదగిరిగుట్ట, మద్దిమడుగు, నెల్లూరు జిల్లాలోని రెహమనాబాద్ దర్గాకు కూడా బస్సులు నడుపుతున్నాం.

ఆంధ్రజ్యోతి: కార్తీకమాసంలో ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారా?

డీఎం: కార్తీకమాసం పురస్కరించుకొని ప్రయాణికుల కోరిక మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామ క్షేత్రాలకు డీలక్స్ బస్సులు నడిపిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మారుమూల ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారా?

డీఎం: దేవరకొండ ఆర్టీసీ డిపో పరిధిలో రోడ్డు సౌకర్యం ఉండి ప్రయాణికుల కోరిక మేరకు చందంపేట, నేరేడుగొమ్ము, పీఏపల్లి, డిండి మండలాలలోని మారుమూల గ్రామాలకు బస్సులు నడుపుతున్నాం. పాఠశాలల సమయంలో మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యం కోసం బస్సులు నడుపుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రయాణికులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

డీఎం: ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యం చేరాలి. ఆర్టీసీ ఆధాయానికి సహకరించాలి. ప్రయాణికుల కోరిక మేరకు బస్సులు నడుపుతాం. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించవద్దు. ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించి సహకరించాలి.

రోడ్డు బాగుపడేదెప్పుడో?

- కంకర రాళ్లపై ప్రయాణం... ఇబ్బందుల్లో ప్రజలు
- లోలెవల్ వంతెనలతో రాకపోకలకు అంతరాయం
- అధ్వానంగా చింతపల్లి- కుర్మపల్లి రహదారి
- పట్టించుకోని అధికారులు



కంకరతేలి ఉన్న కిష్టారాయినిపల్లి గ్రామానికి వెళ్లే దారి, అధ్వానంగా నరసింహాపురం గ్రామానికి వెళ్లే రహదారి

చింతపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు మాత్రం మారడం లేవు. గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేయాలని ఆదేశిస్తున్నా వాటిని క్షేత్రస్థాయిలో అమలుపరచడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చింతపల్లి మండలంలోని వర్కాల గ్రామం మీదుగా రాయినిగూడెం, నరసింహపురం, కిష్టారాయినిపల్లితో పాటు మర్రిగూడ, నాంపల్లి మండల కేంద్రాలకు వెళ్లాలంటే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ప్రమాదాలకు చిరునామాగా మారింది. 11 ఏళ్ల క్రితం చింతపల్లి మండల కేంద్రం నుంచి నరసింహపురం గ్రామ సమీపంలోకి బీటీ రహదారితో పాటు రహదారి మధ్యలో నాలుగు లోలెవల్ వంతెనల నిర్మాణ పనుల కోసం రూ. కోటి వ్యయంతో నిర్మించారు. ప్రధానంగా ఈ రహదారి గుండా డిండి, ఎత్తిపోతల ప్రాజెక్టు, కిష్టారాయినిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణ పనుల కోసం నిత్యం వందల సంఖ్యలో లారీలు, టిప్పర్ల ద్వారా ఇసుకను అధిక లోడ్‌తో తరలించారు. దీంతో బీటీ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో పాటు రహదారి పూర్తిగా కంకర తేలి గుంతలమయంగా మారింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకారణంగా బీటీ పూర్తిగాధ్వంసమై కంకర తేలి గుంతలమయంగా మారింది. వాహనదారులు రహదారి గుండా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు

ఈ రహదారిపై నాలుగు వంతెనలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి సంవత్సరం గడుస్తున్నా వాహనదారుల సమస్యలు మాత్రం తీరడం లేవు. వరదనీరు ప్రవహించినప్పుడు లోలెవల్ వంతెనల కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మూడేళ్ల క్రితం రాయినిగూడెం గ్రామానికి చెందిన మహిళ ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయింది. దీంతో పాటు రాత్రివేళ్లలో వాహనదారులకు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. బిల్లులు రాకపోవడంతో వంతెన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. గ్రామస్థులు మండల కేంద్రంతో పాటు మర్రిగూడ మండల కేంద్రాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రజలు కోరుతున్నారు.

రహదారి పనులను తక్షణమే ప్రారంభించాలి



కిష్టారాయినిపల్లి నుంచి చింతపల్లి మండల కేంద్రం వరకు బీటీ రహదారితో పాటు మర్రిగూడ మండల కేంద్రాలకు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ఎనిమిదేళ్లవుతున్నా బీటీ రహదారి నిర్మాణ పనులకు ఎలాంటి మరమ్మతులు నిర్వహించలేదు. త్వరితగతిన అధికారులు బీటీ రోడ్డు పనులకు టెండర్ ప్రక్రియ చేపట్టి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి.

- ఏర్పుల చిన్న నరసింహ, రాయినిగూడెం

హైలెవల్ వంతెనలు నిర్మించాలి



చింతపల్లి మండల కేంద్రం నుంచి రాయినిగూడెం గ్రామానికి వెళ్లే దారిలో గతంలో లోలెవల్ వంతెనలు నిర్మించారు. కురుస్తున్న వర్షాలకు వరదనీటి ప్రవహం ఉధృతంగా రావడంతో కల్వర్టుల్లో నీరు చేరుతుంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రభుత్వం, అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి హైలెవల్ వంతెనలతో పాటు కల్వర్టు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి.

- జయమ్మ, మాజీ సర్పంచ్, రాయినిగూడెం

నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతాం

చింతపల్లి మండల కేంద్రం మీదుగా వర్కాల, రాయినిగూడెం, నరసింహపురం, కిష్టారాయినిపల్లి, నుంచి కుర్మపల్లి వరకు రహదారి నిర్మాణ మరమ్మతుల కోసం రూ.11కోట్లతో పనులు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా వర్కాల నుంచి నరసింహపురం వరకు 5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేసింది. కిష్టాయినిపల్లి నుంచి కుర్మపల్లి వరకు మరో రూ. 6కోట్ల కోసం నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. రహదారికి కావాల్సిన చోట కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేశాం. బిల్లులు విడుదలైన వెంటనే పనులు పూర్తి చేసేందుకు తగిన ప్రణాళిక తయారుచేశాం.

- లింగారెడ్డి, పీఆర్‌డీఈ, చింతపల్లి

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని ఆధ్యాత్మిక ప్రముఖులు, వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ అన్నారు. శ్రీ ధర్మశాస్త్ర పీఠం ఆధ్వర్యంలో సనాతన ధర్మ సంరక్షణ కోసం వాడపల్లి మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి దర్శనానికి చేపట్టిన పాదయాత్రకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మమే దైవమని, ధర్మాన్ని ఆచరిస్తే భగవంతుని అనుగ్రహం పొందవచ్చని అన్నారు. సమాజసేవ చేయాలని, ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని సూచించారు. మాలధారణ భక్తితో పాటు బాధ్యతను పెంచుతుందని, విలువలు, విశ్వాసాలను బలోపేతం చేస్తుందన్నారు. ధర్మపరిక్షణ, లోక కల్యాణానికై భక్తులు పాదయాత్ర చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు వెంకటరమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి : బీజేపీ

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌నాయక్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటున్నారని అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని, రాష్ట్రంలో కమలం పార్టీని అధికారంలోకి తేవాలని పిలుపునిచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో దేశవ్యాప్తంగా సంబరాలు జరుగుతున్నాయని, స్వదేశీ వస్తు కొనుగోలు విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు వనం మదన్‌మోహన్, నాయకులు బంటు శ్రీనివాస్, దైద రవి, బంటు గిరి, మణిలాల్‌నాయక్, సతీష్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ చాటిన పట్టణ వాసులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలలో పట్టణవాసులు ప్రతిభ చూపారు. నకిరేకల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రం నలుమూలలకు చెందిన యోగాభిమానులు హాజరైనట్లు యోగా టీచర్ల కోఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కోల సైదులు తెలిపారు. పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన పతంజలి నిత్య యోగా క్లబ్ యోగా సాధకురాలు ఎం.రమ, దోమలపల్లి సౌమ్య, హన్షిత్, మోక్షిత్ రాష్ట్రస్థాయి గుర్తింపు, బహుమతులు గెలుపొందడం అభినందనీయమని పేర్కొన్నారు. యోగాసనాలతో జీవనశైలి మార్పులతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాగయ్య, పిచ్చయ్య, శ్రీనివాస్, శివ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని రోజులు ఈ ఇబ్బందులు!

(5వ పేజీ తరువాయి)

కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌లకు వెబ్‌సైట్ సహకరించకపోవడంతో రిజిస్ట్రేషన్లు వాయిదాపడుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల కారణంగా డాక్యుమెంట్ల అప్‌లోడ్ కూడా ఆలస్యమవుతోంది. కొన్నిసార్లు అయితే ఒక్క డాక్యుమెంట్‌ను నాలుగైదు సార్లు ప్రయత్నిస్తే తప్ప అప్‌లోడ్ కావడం లేదు. వెబ్‌సైట్‌లో లోపాలతో ఓటీపీ రాకపోవడం, డిజిటల్ సంతకాలకు ఆలస్యమవడం జరుగుతోంది. ఇప్పటికైనా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సాంకేతిక సమస్యలు అధిగమించడానికి సర్వర్ సామర్థ్యం పెంచడంతో పాటు ఇంటర్‌నెట్ వేగాన్ని పెంచాలని, బ్యాకప్ సర్వర్ వంటివి ఏర్పాటుపై దృష్టిపెడితేనే ఆస్తుల క్రయ, విక్రయదారుల సమస్యలు తొలగుతాయని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు.

అభివృద్ధి కోసం పరితపించిన రాంమూర్తి

• మాజీ మంత్రి జానారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

త్రిపురారం అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చలకుర్తి మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రాంమూర్తి తనకు ఆత్మీయుడని, అభివృద్ధి కోసం పరితపించేవాడని సీఎల్పీ మాజీ నేత, మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో రాంమూర్తియాదవ్ విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఆదివారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌లతో కలిసి ఆవిష్కరించా రు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1994లో ఎమ్మెల్యేగా ఒక పర్యాయం పనిచేసిన రాంమూర్తి, తర్వా త ఎమ్మెల్యేగా తను ప్రజల అభివృద్ధి కోసం పాటుపడినట్లు తెలిపారు. ఆయన కుటుంబానికి రాజకీయంగా, మానవ సంబంధాలు కొనసాగిస్తూ వారికి అండగా ఉంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రాంమూర్తి పేరును వరద కాల్వకు పెట్టాలని కుటుంబ సభ్యులు కోరగా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా చూస్తానని అన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కూడా మాజీ ఎమ్మెల్యే రాంమూర్తి కుటుంబానికి ఎల్లవేళలా తోడు ఉంటామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్, కాంగ్రెస్ నాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, నాయకులు కుంటిగొ ర్ల రాజశేఖర్, బుచ్చిరెడ్డి, గుండెబోయిన రాంమూర్తి కుమారులు కోటేష్‌యాదవ్, నగేష్‌యాదవ్, మర్ల చంద్రరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

• సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

అడవిదేవులపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆ సమస్యలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా సాదాబైనామా దరఖాస్తులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అధికారులు కార్యాలయాలకు సమయానుకూలంగా రావాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాగ్యానాయక్, ఆర్‌ఐ శ్యామ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సాయి, జూనియర్ అసిస్టెంట్‌లు, జీపీవోలు అంజయ్య, మహ్మద్‌అలీ, బాలాజీనగర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రభుత్వ భూముల్లో చాలా సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న తమకు ప్రభుత్వం పట్టాలు అందించాలని కోరుతూ పలువురు రైతులు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన్ను పలువురు రైతులు కలిసి తమ కలిశారు ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండలంలో జిలకరకుంట తండా, హాముతండాకు చెందిన రైతులు తాతలకాలం నుంచి కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నారని, రైతులకు పట్టాలు అందించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ అన్ని సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు కొర్ర అశోక్‌నాయక్, హుస్సేన్, దమ్ము, లచ్చు, బిక్కు, నాగా, రంగా, రమేష్, మధు, వేణు, మంగ్యా, చిన్న బిక్కు, పాండు, శివుడు, గుగులోతు స్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు అన్నదానం అభినందనీయం

హాలియా, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలధారులకు 41రోజులు అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని హాలియా సీఐ సతీష్‌రెడ్డి అన్నారు. హాలియాలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం, హనుమాన్ జాగరణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొన్నేళ్లుగా స్వామి మాలధారులకు 41 రోజులు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం చాలా విశేషమని, ఇంతటి మహోత్తర కార్యక్రమం నిర్వహించడానికి శ్రమిస్తున్న మేడేపల్లి మోహన్‌రావు గురుస్వామిని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్వాములంతా అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సీఐ సతీష్‌రెడ్డి, అన్నదాత రామ్‌రహీంను నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో చిన్నరాములు, భాస్కర్‌రెడ్డి, పరకాల సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అయ్యప్ప, అంజనేయస్వామి మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ ప్రహరీ నిర్మాణానికి ఆర్థికసాయం



ప్రహరీ గోడ నిర్మాణానికి పూజ చేస్తున్న జాల నరసింహారెడ్డి

కొండమల్లేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండలంలోని గాజీనగర్ ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని చింతచెట్టుతండాలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి జాలె బ్రదర్స్ నరసింహారెడ్డి రూ.5.60లక్షలు ఆర్థికసాయం అందజేశారు. గతంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు దేవాలయ నిర్మాణానికి ఆర్థికసాయం అందజేయడంపై గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మిలాల్, దాస్య, శ్రీనునాయక్, హరిసింగ్, సూర్య, శాంత్య, బావోజి, హేమానాయక్, రవి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు లక్కీడ్రా నేడు

(5వ పేజీ తరువాయి)

ప్రధానంగా జాతరలు, పారిశ్రామికప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని దుకాణాలకు ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఇక్కడ లక్కీడ్రా రూపంలో అదృష్టం ఎవరిని వరించనుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం

జిల్లాలో మద్యం దుకాణాల నిర్వాహకుల ఎంపికకు సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహిస్తాం. ఇందుకోసం హైద్రాబాద్‌రోడ్డులోని లక్ష్మీగార్డెన్స్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. దరఖాస్తుదారులు, వారు అనుమతించిన అధీకృత వ్యక్తులు ఉదయం 10లోపే అక్కడకు చేరుకోవాలి. 11 గంటలకు డ్రా కారక్రమం మొదలవుతుంది. డ్రాలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు వచ్చే రెండేళ్ల మద్యందుకాణాల నిర్వహణకు అనుమతిస్తాం. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా దుకాణాలు నడపాల్సి ఉంటుంది. నిబంధనలు అతిక్రమించినా,ఆటంకాలు కల్పించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- బి.సంతోష్‌కుమార్, జిల్లా ఎక్సైజ్ అధికారి

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న పాదూరి శశిధర్‌రెడ్డి

వేములపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నేలవాలి నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. మండలంలోని మొల్కపట్నం గ్రామ శివారులో నేలవాలిన పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల మేర పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికందే దశలో నేలవాలడంతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విపత్కర పరిస్థితుల్లో దెబ్బతిన్న పంటకు ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందేదని కానీ ప్రస్తుతం రైతుబంధు సాకుతో ప్రభుత్వం ఇలాంటి వాటికి స్వస్తి పలికే ఆలోచనలో ఉందని ఆయన ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని అన్నారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయకుండా చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కదిలి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వపరంగా పరిహారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, వడ్డెగాని సైదులు, రెమడాల భిక్షం, బొమ్మగాని శ్రీను, ఎల్లయ్య, జానయ్య, వెంకన్న, శ్రీను, ఆంజనేయులు, మంగమ్మ, సైదులు, ఎరుకలయ్య తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల కలయిక

• 43 సంవత్సరాల సమ్మేళనం • బాల్యంలోని జ్ఞాపకాలతో సరదాగా గడిపిన స్నేహితులు

డిండి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలిశారు. నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బాల్యంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరిని ఒకరు పలకరించుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన 8 మంది బాల్య మిత్రులతోపాటు తమకు విద్యా బుద్ధులు నేర్పిన దివంగత గురువులకు సంతాపం తెలిపారు. అనంతరం నాటి గురువులు జగపతిరావు, మాలతిలను ఘనంగా శాలువాతో సన్మానించారు. బాల్యంలోని చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాధవరం రవీందర్‌రావు, బికుమాళ్ల శ్రీనివాసులు, గుమ్మడవెల్లి శ్రీనివాస్, జూలూరి నగేష్, ఎస్‌ఆర్ మధుసూదనచారి, పానగంటి నర్సింహ, సుదిని రాజేందర్‌రెడ్డి, సపావట్ రాములు, యేసోబు, రాజేశ్వరి, సంబు తిరుపతయ్య, కృష్ణయ్య, అరుణమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దేశభక్తిని పెంపొందించుకోవాలి



దేవరకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు

దేవరకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆర్‌ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దేవరకొండలో ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో సరస్వతీ శిశుమందిర్ నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్న త పాఠశాల వరకు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆర్‌ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోతిలాల్, పొలిశెట్టి వెంకటేశ్వర్లు, తాటిశెట్టి సుదర్శన్, కర్నాటి సురేష్, బెజవాడ శేఖర్, ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.